తెలుగు దినపత్రిక

సిరి

People's Voice

వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

19-10-2026

సోమవారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 251

PUBLISHED FROM HYDERABAD

పేజీలు- 8 వెల:రూ.4 /–



తెలంగాణకే ప్రత్యేకమైన పూల పండుగ

బతుకమ్మ

పూలను ఓ ఆకారంగా పేర్చి దేవుడిగా పూజించడం అనేది ప్రపంచంలో ఎక్కడ కనిపించదు. ఒక్క తెలంగాణలో మాత్రం బతుకమ్మ పేరుతో పూలను పూజించే సంప్రదాయం తరతరాలుగా కొనసాగుతోంది. తెలంగాణలోని ప్రతీ ఆడపడుచు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే బతుకమ్మ పండుగ రానే వచ్చింది. యువతులు, ముత్తైదువులు ఆడుతూ పాడుతూ చూపరులను అలరించే అరుదైన వేడుక ఈ బతుకమ్మ పండగ. మహాలయ అమవాస్యతో ప్రారంభమై 9 రోజుల పాటు వైభవంగా సాగే ఈ పండగ శనివారం ప్రారంభంకానుంది.

ట్రాన్స్‌ఫార్మర్ల లోడ్లను నిరంతరం పర్యవేక్షించాలి

- ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదు
- ఇంజినీరింగ్ బృందాలు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలి
- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్
- గచ్చిబౌలి సబ్‌స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ
- వాస్తవ లోడ్ పరిస్థితులను అడిగి తెలుసుకున్న సీఎండీ

తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 18 (సిరి న్యూస్):

రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్ల లోడ్లను నిరంతరం పర్యవేక్షించాలని, వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని గచ్చిబౌలి సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్‌స్టేషన్‌లోని

మిగతా 2వ పేజీలో..





సద్దుల బతుకమ్మతో తెలంగాణలో పూల సంబరం

హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై అంబరాన్నంటిన వేడుకలు

- 700 మంది కళాకారులతో జానపద కళారూపాల ప్రదర్శన
- లేజర్ షోలు, బాణసంచాతో ప్రత్యేక ఆకర్షణ
- రాష్ట్రవ్యాప్తంగా పల్లెపల్లెలో మహిళల సందడి

హైదరాబాద్, అక్టోబర్ 18 (సిరి న్యూస్):

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా వైభవంగా జరిగాయి. హైదరాబాద్‌లోని హుస్సేన్ సాగర్ తీరాన ట్యాంక్‌బండ్ పూల పండుగ శోభతో కళకళలాడింది. వేలాది మంది మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మ పాటలు, కోలాటాలు, జానపద కళారూపాలతో పరిసరాలు మార్మోగాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పండుగ సందడి నెలకొంది.

పూలతో బతుకమ్మల అలంకరణ

* తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర పూలతో మహిళలు బతుకమ్మలను అందంగా పేర్చారు. వాటి చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ నృత్యాలు చేశారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ట్యాంక్‌బండ్ ప్రాంతం పూలపనాన్ని తలపించింది. తెలంగాణ ఆచార వ్యవహారాలు, గ్రామీణ జీవన శైలి వేడుకల్లో ప్రతిబింబించాయి.

మిగతా 2వ పేజీలో..

చైనా ఏజెంట్లకు

రహస్య సమాచారం చేరవేత?..

3

ఎన్హెచ్ఎం ఉద్యోగులకు న్యాయం చేయకుంటే ఉద్యమం: కవిత

- జీతాల కోత నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్
- జీవో 1195ను సమీక్షించాలని సీఎం రేవంత్‌కు సూచన
- ఒక్కొక్కరి వేతనంలో రూ.4 వేల నుంచి రూ.5 వేల కోత

2




పంట చేలల్లో కరెంటు అధికారులు

- రైతులతో ముఖాముఖీ..
- సత్పలితాలనిస్తున్న టీజీఎస్పీడీసీఎల్ పాలం బాట
- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ఆదేశాలతో క్షేత్రస్థాయిలో ముమ్మర పర్యటనలు

2





జర్మనీ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు టోమ్‌కామ్ టోకరా?

- 70 మందికి పైగా యువత నుంచి కోట్లాది రూపాయల వసూలు
- రూ.4.5 లక్షలు చెల్లించినా దక్కని ఉద్యోగాలు
- హరీశ్‌రావు ఆరోపణలు.. రెండేళ్లుగా ఎదురుచూపులు
- విచారణ జరిపి బాధితులకు పరిహారం చెల్లించాలని డిమాండ్

2

ఆలయాల అభివృద్ధికి రూ.2,500 కోట్లు

- నాచారం వెంకటేశ్వరస్వామి ఆలయ రహదారికి శంకుస్థాపన
- రూ.44 కోట్లతో భక్తులకు మెరుగైన రహదారి సౌకర్యం
- రహదారుల నిర్మాణానికి రూ.90 వేల కోట్ల కేటాయింపు
- సంక్షేమ పథకాల కొనసాగింపే లక్ష్యం: భట్టి విక్రమార్క

2





తాగునీటి వృథాపై జలమండలి కొరడా

- జూబ్లీహిల్స్ పబ్‌కు రూ.20 వేల జరిమానా
- తాగునీటి కనెక్షన్ తొలగింపు.. ట్యాంకర్ల సరఫరా నిలిపివేత
- వాణిజ్య సంస్థలకు జలమండలి హెచ్చరిక
- నీటి దుర్వినియోగంపై ఫిర్యాదులకు ప్రత్యేక నంబర్లు

హైదరాబాద్, అక్టోబర్ 18 (సిరి న్యూస్):

హైదరాబాద్ నగరంలో తాగునీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు జలమండలి అధికారులు చర్యలు చేపట్టారు. జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలోని రోడ్ నంబర్ 45, ప్లాట్ నంబర్ 872లో ఉన్న ఫోర్ ఫాదర్స్ పబ్‌లో నీటి దుర్వినియోగం జరుగుతోందన్న ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఉల్లంఘన జరిగినట్లు గుర్తించిన అధికారులు పబ్ యాజమాన్యానికి రూ.20 వేల జరిమానా విధించారు. తాగునీటి వృథాను నిరోధించేందుకు నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నట్లు జలమండలి వెల్లడించింది. పబ్‌పై జరిమానా విధించడంతోపాటు అక్కడి తాగునీటి కనెక్షన్‌ను అధికారులు తొలగించారు. జలమండలి నింపే కేంద్రం నుంచి వాణిజ్య అవసరాల కోసం నీటి ట్యాంకర్ల

మిగతా 2వ పేజీలో..

టైగర్ ష్రాఫ్‌పై కాల్పులు..

సల్మాన్ ఖాన్‌తో సాన్నిహిత్యమే కారణమా?



- జుహులో కాల్పుల ఘటన.. టైగర్ ష్రాఫ్‌కు తప్పిన ప్రమాదం
- డ్రైవర్ సహా ఇద్దరికి గాయాలు.. పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం
- లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పేరుతో సోషల్ మీడియాలో హెచ్చరికలు

3

ఫ్యూచర్ సిటీపై సీఎం రేవంత్ ఫోకస్..

- నేడు కీలక ప్రాజెక్టులకు శ్రీకారం
- * ఇబ్రహీంపట్నంలో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ప్రారంభం
- * యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పనుల పరిశీలన

3

డిజిటల్ అరెస్టు మోసం.. ఇద్దరు అరెస్టు

రిటైర్డ్ ఉద్యోగి నుంచి రూ.29.17 లక్షలు కాజేత

పోలీసులు, సీబీఐ, ఈడీ అధికారులమంటూ బెదిరింపులు

రూ.6.8 కోట్ల మనీలాండరింగ్ కేసులో ఇరికిస్తామని భయపెట్టిన వైనం

మ్యూల్ ఖాతాలు, క్రిప్టో లావాదేవీలతో సొమ్ము మళ్లింపు

3



సద్దుల బతుకమ్మతో తెలంగాణలో పూల సంబరం

700 మంది కళాకారులతో జానపద ప్రదర్శనలు

* సుమారు 700 మంది కళాకారులు తెలంగాణ జానపద కళారూపాలను ప్రదర్శించారు. సంప్రదాయ నృత్యాలు, జానపద గీతాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కళాకారుల ప్రదర్శనలను తిలకించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మహిళల ఐక్యత, ప్రకృతితో ముడిపడిన తెలంగాణ జీవన సంస్కృతి ఈ వేడుకల్లో ప్రత్యేకంగా కనిపించింది.

లేజర్ షోలు.. బాణసంచా సందడి

సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు నిర్వహించిన లేజర్ షోలు, బాణసంచా ప్రదర్శనలు వేడుకలకు మరింత శోభను తెచ్చాయి. అమరవీరుల స్మారక కేంద్రం నుంచి ప్రారంభమైన కార్యక్రమాలు ట్యాంక్‌బండ్ వద్ద బతుకమ్మల నిమజ్జనంతో ముగిశాయి. మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ బతుకమ్మకు వీడ్కోలు పలికారు.

పల్లెపల్లెలో పండుగ సందడి

*హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పలు జిల్లాలు, పట్టణాలు, గ్రామాల్లోనూ సద్దుల బతుకమ్మ వేడుకలు ఉత్సాహంగా సాగాయి. మహిళలు ఇళ్ల వద్ద, వీధుల్లో, చెరువుల పరిసరాల్లో బతుకమ్మలను పేర్చి పూజలు నిర్వహించారు. సాయంత్రం వేళల్లో బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక ఆచారాలకు అనుగుణంగా వేడుకలు నిర్వహించగా, పట్టణాల్లోనూ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాకుండా తెలంగాణ అస్తిత్వాన్ని, మహిళల ఐక్యతను, ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని చాటిచెప్పే సాంస్కృతిక వేడుకగా నిలిచింది. తరతరాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయం మరోసారి రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పింది.

ఆలయాల అభివృద్ధికి రూ.2,500 కోట్లు

వైరా, అక్టోబర్ 18 సిరి న్యూస్

ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గంలోని నాచారంలో కొలువుదీరిన శ్రీ అద్భుత వెంకటేశ్వరస్వామిని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తుల సౌకర్యార్థం రూ.44 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఆలయ రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ప్రయాణ సౌకర్యాలు మెరుగుపరచడం, రాకపోకల్లో ఇబ్బందులను తగ్గించడం లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఆలయాలకు వచ్చే భక్తుల కు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన ఆలయాల అభివృద్ధి, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనలో భాగంగా వివిధ కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. నాచారం ఆలయ రహదారి పనులు పూర్తయితే స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణం అందుబాటులోకి రానుంది. రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధి కోసం రూ.2,500 కోట్లు కేటాయించినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. అదే విధంగా రహదారుల నిర్మాణానికి రూ.90 వేల కోట్లు కేటాయించామని వెల్లడించారు. ఆలయాల అభివృద్ధితో పాటు రవాణా సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. భక్తులు ఆలయాలకు సులభంగా చేరుకునేలా రహదారుల నిర్మాణం, అభివృద్ధి పనులు చేపట్టడం అవసరమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రముఖ ఆలయాలకు వచ్చే భక్తులకు రవాణా సౌకర్యాలు మెరుగుపడితే ప్రయాణ ఇబ్బందులు తగ్గుతాయని వివరించారు. నాచారంలోని శ్రీ అద్భుత వెంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.44 కోట్లతో చేపట్టనున్న రహదారి పనులు ఈ దిశగా కీలకమైన చర్యగా నిలవనున్నాయి. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆధ్యాత్మిక కేంద్రాల ప్రగతికి కేటాయింపులు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గత పాలకుల నుంచి సంక్రమించిన రుణాల భారం నెలకు రూ.6,600 కోట్లుగా ఉన్నప్పటికీ ప్రజా సంక్షేమ పథకాలను నిరంతరాయంగా కొనసాగిస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. ఆర్థికపరమైన సవాళ్లు ఉన్నప్పటికీ ప్రజలకు అందించే సంక్షేమ ప్రయోజనాల్లో వెనుకడుగు వేయడం లేదని పేర్కొన్నారు. పేద కుటుంబాలకు అవసరమైన సహాయం అందించడం, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ప్రభుత్వ ప్రాధాన్యాల్లో భాగమని వివరించారు. ఆర్థిక పరిస్థితులను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించడం ద్వారా వివిధ వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూర్చాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రజలకు ప్రయోజనం కల్పిస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. పేద కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించడం, విద్యుత్ అవసరాలకు తోడ్పాటు అందించడం, ఆహార భద్రత కల్పించడం వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు.

ఎన్జీఓఎం ఉద్యోగులకు న్యాయం చేయకుంటే ఉద్యమం: కవిత

హైదరాబాద్, అక్టోబర్ 18 సిరి న్యూస్:

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్జీఓఎం) ఉద్యోగులకు న్యాయం చేయకపోతే వారి పక్షాన పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. ఉద్యోగుల జీతాల్లో కోత విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 1195ను వెంటనే సమీక్షించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఎన్జీఓఎం ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. * రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17 వేల మంది ఎన్జీఓఎం ఉద్యోగులు పనిచేస్తుండగా, తాజా జీవోతో కొందరి జీతాల్లో రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు కోత పడుతోందని కవిత ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుతున్న తరుణంలో వేతనాలు తగ్గించడం అన్యాయమని మండిపడ్డారు. కొందరికి జీతాలు పెంచి, మరికొందరికి తగ్గించడంలో వివక్ష కనిపిస్తోందని విమర్శించారు. కేంద్రం ఎన్జీఓఎం ఉద్యోగుల వేతనాల కోసం నిధులు ఇస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం వాటిని సకాలంలో విడుదల చేయడం లేదని ఆరోపించారు.

ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఏదీ?

ఎన్నికల ముందు ఎన్జీఓఎం ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని కవిత విమర్శించారు. కాంగ్రెస్ పాలిత హిమాచల్ ప్రదేశ్‌తో పాటు ఏడు రాష్ట్రాలు ఇప్పటికే ఎన్జీఓఎం సిబ్బందిని పర్మినెంట్ చేశాయని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సైతం 30 శాతం జీతాలు పెంచడంతో పాటు ఉద్యోగుల క్రమబద్ధీకరణ కోసం అసెంబ్లీలో తీర్మానం చేసిందని తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు, టీకాల కార్యక్రమాల అమలులో ఎన్జీఓఎం ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని కవిత పేర్కొన్నారు. తమ సమస్యలపై నిరసన తెలిపేందుకు అనుమతి నిరాకరించడం, ఆరోగ్య మంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం దారుణమని అన్నారు.ప్రభుత్వం వెంటనే జీవోను సమీక్షించి, వేతనాల కోతను నిలిపివేయడంతో పాటు ఉద్యోగుల జీతాలు పెంచాలని, సర్వీసులను క్రమబద్ధీకరించాలని కవిత డిమాండ్ చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ల లోడ్లను నిరంతరం పర్యవేక్షించాలి

మొదటిపేజీ తరువాయి

పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద వాస్తవ లోడ్ పరిస్థితులను అధికారులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ అందుబాటులో ఉన్న ఇంజినీరింగ్ అధికారులతో ప్రస్తుత విద్యుత్ పరిస్థితులు, పెరుగుతున్న డిమాండ్‌ను ఎదుర్కొనేందుకు చేపట్టిన ముందస్తు చర్యలపై సుదీర్ఘంగా సమీక్ష జరిపారు. రానున్న కాలంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు ట్రాన్స్‌ఫార్మర్లపై పడుతున్న లోడ్‌ను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో ఎక్కడా అంతరాయాలు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వినియోగదారులు విద్యుత్‌ను పొదుపుగా, బాధ్యతాయుతంగా వినియోగించేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అనవసర వినియోగాన్ని అరికట్టడంతో పాటు గరిష్ఠ డిమాండ్ సమయాల్లో లోడ్ నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్యుత్ సరఫరా వ్యవస్థను పటిష్టంగా ఉంచేందుకు ఇంజినీరింగ్ బృందాల మధ్య సమన్వయం అత్యంత కీలకమని, క్షేత్రస్థాయిలో సమస్యలను తక్షణమే గుర్తించి పరిష్కరించేందుకు అధికారులు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ ఆకస్మిక తనిఖీ మరియు సమీక్షా సమావేశంలో చీఫ్ ఇంజినీర్ గోపయ్య, సైబర్ సిటీ సూపరింటెండింగ్ ఇంజినీర్ చంద్రశేఖర్, ట్రాన్స్‌కో ఎస్ఈ భాస్కర్, గచ్చిబౌలి ఆపరేషన్స్ డివిజనల్ ఇంజినీర్ ప్రసాద్, గచ్చిబౌలి లైన్స్ డీఈ రవికుమార్, కొండాపూర్ ఆపరేషన్స్ డీఈ శ్యామ్, గచ్చిబౌలి సబ్‌డివిజన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ శివకృష్ణ ప్రసాద్‌తో పాటు ఇతర అధికారులు మరియు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పంట చేలల్లో కరెంటు అధికారులు

- **వికారాబాద్, మెదక్, సంగారెడ్డి, నాగర్‌కర్నూల్ సహా పలు సర్కిళ్లలో పాలం బాట**
- **నేరుగా రైతుల వద్దకు వెళ్తున్న విద్యుత్ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది**
- **టంగ్ టెస్టర్‌లతో ట్రాన్స్‌ఫార్మర్లు, బోరు మోటార్ల వద్ద వోల్టేజ్ స్థాయిల తనిఖీ**
- **రైతులతో ముఖాముఖీగా మాట్లాడి అభిప్రాయాల సేకరణ**
- **ఎల్‌నినో కరువు పరిస్థితులు, భూగర్భ జలాలు, నీటి పొదుపుపై రైతులకు అవగాహన**
- **సమస్యలను పరిష్కరిస్తూ అన్నదాతలకు భరోసా కల్పిస్తున్న డిస్కం**



తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 18 (సిరి న్యూస్):

పంటలు సాగు చేస్తున్న అన్నదాతల ముంగిట్లోకి నేరుగా వెళ్లి విద్యుత్ సరఫరా పరిస్థితులను పర్యవేక్షించడం, వారు ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించడమే లక్ష్యంగా టీజీఎస్పీడీసీఎల్ చేపట్టిన పొలం బాట కార్యక్రమం సత్ఫలితాలనిస్తోంది. సంస్థ సీఎండీ జితేష్ వి. పాటిల్ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం సెలవుదినాన్ని సైతం లెక్కచేయకుండా డిస్కం పరిధిలోని పలు సర్కిళ్లలో అధికారులు నేరుగా వ్యవసాయ పొలాల బాట పట్టారు. వికారాబాద్, నాగర్‌కర్నూల్, నల్గొండ, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల, యాదాద్రి భువనగిరి, మేడ్చల్, సూర్యాపేట సర్కిళ్ల పరిధిలోని పలు సెక్షన్లు, సబ్‌డివిజన్లలో అధికారులు పర్యటించి రైతులతో ప్రత్యక్షంగా ముచ్చటించారు.

క్షేత్రస్థాయిలో విద్యుత్ పారామీటర్ల పరిశీలన

చౌడర్‌గూడ, చిత్తాపూర్, ఉయ్యాలవాడ, నాదింపల్లి, నిజాంపూర్, చౌట్లపల్లి, పుట్టపల్లి, తాడూరు, జంగంపేట, గుమ్మడిదల, కొత్తపల్లి, లక్ష్మీపతిగూడెం, అంబదీపల్లి తదితర గ్రామాలతో పాటు వివిధ వ్యవసాయ ఫీడర్ల పరిధిలో అధికారులు పర్యటించారు. కేవలం మాట్లాడటంతో సరిపెట్టకుండా వ్యవసాయ విద్యుత్ సరఫరాకు సంబంధించిన సాంకేతిక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద లోడ్ పరిస్థితులు, వోల్టేజ్ హెచ్చుతగ్గులు, ఫీడర్ల పరిధిలో నమోదవుతున్న అంతరాయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా అధికారులు రైతులకు పలు కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావం వల్ల రాబోయే వేసవిలో భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉన్నందున, అవసరమైన మేరకే మోటార్లను వినియోగించాలని, తడుల మధ్య అంతరాన్ని పెంచడం ద్వారా నీటిని ఆదా చేయవచ్చని వివరించారు. అలాగే పంటలకు బిందు సేద్యం వంటి ఆధునిక పద్ధతులను అవలంబించాలని సూచించారు.

సమస్యలకు అక్కడికక్కడే మోక్షం


గ్రామాల్లో పర్యటించిన అధికారుల ఎదుట రైతులు తమ పంటల పరిస్థితి, బోరు మోటార్ల పనితీరు, విద్యుత్ సరఫరా సమయాలు, వోల్టేజీ లోపాలను ఫూసగుచ్చినట్లు వివరించారు. అధికారులే స్వయంగా తమ పొలాల వద్దకు వచ్చి సమస్యలను ఆరా తీయడం పట్ల రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో అందుతున్న సరఫరా తీరుపై అభిప్రాయాలను నమోదు చేసుకున్న అధికారులు.. స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని, వ్యవసాయ విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఎల్‌నినో ముప్పు వేళ.. నీటి పొదుపుపై అవగాహన

ప్రస్తుత వేసవిని తలపించే ఎండలు, ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు మరియు భూగర్భ జలాల లభ్యతపై కూడా అధికారులు రైతులతో చర్చించారు. అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీటి వనరులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ అధికారుల సూ చనల మేరకు తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటల వైపు మొగ్గుచూపాలని, బోరుబావుల వద్ద నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు. కార్యాలయాలకే పరిమితం కాకుండా అధికారులే నేరుగా పొలాల వద్దకు వచ్చి సమస్యలను పరిష్కరిస్తుండటంతో విద్యుత్ శాఖ సేవలు మరింత చేరువయ్యాయని, ఇది అన్నదాతలకు ఎంతో మనోధైర్యాన్ని ఇస్తోందని పలువర్గాలు ప్రశంసిస్తున్నాయి.

నా ఆత్మహత్యకు కొందరి ఒత్తిడే కారణం

- **జవాబుదారిగా ఉండాలన్నందుకు నన్ను వేధించారు**
- **డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనారాయణ బలవన్మరణం**
- **భద్రాచలం ప్రైవేట్ లాడ్జిలో విగతజీవిగా గుర్తింపు**
- **ఓ మహిళా డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆమె భర్త, మరో ఇద్దరు విలేకరుల వేధింపులే అంటూ లేఖ విడుదల**
- **తప్పుడు కేసులు పెట్టి, ఆ కేసుకు సంబంధించి వాపసు తీసుకోవడానికి కోటి డిమాండ్ చేశారని ఆరోపణలు**
- **చంపుతామని బెదిరించడంతో మనస్తాపానికి గురై ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం**
- **దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్న ఉద్యోగ వర్గాలు**



లేఖలో పేర్కొన్న సంచలన విషయాలు



తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 18 (సిరి న్యూస్):

నిబద్ధతతో విధులు నిర్వర్తించాల్సిన చోట, లంచాలకు వ్యతిరేకంగా నిలబడి జవాబుదారిగా ఉండాలని కోరినందుకు ఓ ప్రభుత్వ అధికారి తీవ్ర వేధింపులకు గురై బలవన్మరణానికి పాల్పడిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తీవ్ర కలకలం రేపింది. డేటా ఎంట్రీ ఆపరేటర్ అభ్యర్థనను తోసిపుచ్చినందుకు తనపై తప్పుడు కేసులు బనాయించి, వాటిని ఉపసంహరించుకోవడానికి కోటి రూపాయలు డిమాండ్ చేశారని.. ఈ వేధింపులు భరించలేకనే తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని డిప్యూటీ తహశీల్దార్ ఆత్మహత్యకు ముందు రాసిన లేఖ ఇప్పుడు సంచలనంగా మారింది. వివరాల్లోకి వెళితే.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పౌర సరఫరాల గ్యాస్ గోదాం మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న లక్ష్మీనారాయణ (55) ఆదివారం భద్రాచలంలోని ఓ ప్రైవేట్ లాడ్జిలో విగతజీవిగా కనిపించారు. ఆయన మరణానికి ముందు రాసిన ఆత్మహత్య లేఖలో పలువురి పేర్లను ప్రస్తావిస్తూ తన చావుకు కారణాలను స్పష్టంగా వివరించారు. మృతుడు లక్ష్మీనారాయణ రాసిన లేఖ ప్రకారం.. తనకు ఆర్థిక ఇబ్బందులున్నాయని, డబ్బులు సంపాదించుకోవడానికి అవకాశం ఇవ్వాలని తన వద్ద పనిచేసే డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజేష్ ఇబ్బంది పెట్టేవాడని తెలిపారు. ఆ వేధింపులు భరించలేక తాను గత జూలైలో 21 రోజులు సెలవుపై వెళ్లాల్సి వచ్చిందని పేర్కొన్నారు. కార్యాలయం వద్ద సీసీ కెమెరాలు లేకపోవడంతో ఆ డేటా ఎంట్రీ ఆపరేటర్ ఆగడాలు మితిమీరాయని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులను కూడా కోరినట్లు తెలిపారు. లంచాలు తీసుకోవద్దని తాను వారించినందుకు, ఆ డేటా ఎంట్రీ ఆపరేటర్ మరో ఇద్దరు టీవీ ఛానల్ విలేకరులతో కలిసి వచ్చి తనను అందరి ముందూ అసభ్య పదజాలంతో దూషించారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, ఎలాంటి తప్పు చేయకపోయినా తనపై జిల్లా కలెక్టర్‌కు సెప్టెంబర్ 30, 2026 న లైంగిక వేధింపులంటూ తప్పుడు ఫిర్యాదు చేయించారని, ఆ అంతర్గత విచారణ శుక్రవారమే ముగిసిందని లేఖలో పేర్కొన్నారు. తాను ఎలాంటి తప్పు చేయకపోయినా సోషల్ మీడియాలో తనపై దుష్ప్రచారం చేయడం తీవ్ర మనస్తాపానికి గురి చేసిందని వాపోయారు.

కోటి ఇస్తేనే కేసు వాపస్..

తనపై కలెక్టర్‌కు ఇచ్చిన తప్పుడు లైంగిక వేధింపుల కేసును వాపసు తీసుకోవడానికి డేటా ఎంట్రీ ఆపరేటర్ భర్త ఏకంగా కోటి రూపాయలు డిమాండ్ చేశాడని, కరీం అనే వ్యక్తి ద్వారా ఈ విషయం తనకు తెలిపిందని లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అంత పెద్ద మొత్తంలో డబ్బులు తాను ఇవ్వలేనని చెప్పినట్లు తెలిపారు. ఈ పరిణామాలన్నింటి వల్ల తీవ్ర మనోవేదనకు, ఒత్తిడికి గురైన తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని.. తన చావుకు ఆ డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆమె భర్త మరియు మరో ఇద్దరు విలేకరులే పూర్తి బాధ్యత వహించాలని లేఖలో స్పష్టం చేశారు. ఒక ప్రభుత్వ అధికారి ఈ విధంగా బలవన్మరణానికి పాల్పడటం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తీవ్ర విషాదాన్ని నింపగా, ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు.

జర్మనీ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు టోమ్‌కామ్ టోకరా?

హైదరాబాద్, అక్టోబర్ 18 సిరి న్యూస్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఆధ్వర్యంలోని తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ నిరుద్యోగ యువతను మోసం చేసే వ్యవస్థగా మారిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. జర్మనీలో ఉద్యోగాలు కల్పిస్తామంటూ 70 మందికి పైగా యువత నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి, వారికి ఉద్యోగాలు కల్పించకుండా ఇబ్బందులకు గురిచేశారని సామాజిక మాధ్యమ వేదికగా విమర్శించారు. విదేశాల్లో ఉద్యోగాలు సాధించి కుటుంబాలను ఆదుకోవాలనే ఆశతో డబ్బులు చెల్లించిన నిరుద్యోగులు రెండేళ్లుగా ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ సంస్థ ద్వారా ఇలాంటి పరిస్థితి ఏర్పడటంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు వివరాల ప్రకారం, సుమారు 15 జిల్లాలకు చెందిన 70 నుంచి 75 మంది నిరుద్యోగ యువకుల నుంచి టోమ్‌కామ్ ఒక్కొక్కరి వద్ద రూ.4.10 లక్షల చొప్పున వసూలు చేసింది. పరీక్షలు, బీమా, వీసా ఖర్చులు కలిపితే ఒక్కో అభ్యర్థికి దాదాపు రూ.4.5 లక్షల వరకు వ్యయం అయిందని ఆయన తెలిపారు. వీరిలో చాలామంది పేద రైతు కుటుంబాలకు చెందినవారని, విదేశాల్లో ఉద్యోగాలు వస్తాయనే నమ్మకంతో కుటుంబ సభ్యుల బంగారాన్ని తాకట్టు పెట్టి, అప్పులు చేసి మరీ డబ్బులు చెల్లించారని వివరించారు. ఉద్యోగాలు వస్తాయని ఆశించిన యువతకు రెండేళ్లు గడిచినా ఫలితం లేకపోవడంతో అప్పులపై వడ్డీలు చెల్లిస్తూ కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల్లో ఒక్కరికి కూడా జర్మనీలోని కంపెనీల నుంచి ఇంటర్వ్యూ అవకాశం రాలేదని హరీశ్‌రావు ఆరోపించారు. జర్మన్ భాషలో బీ1 స్థాయి పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులను ఇప్పుడు బీ2 స్థాయి పరీక్షలో ఉత్తీర్ణులు కావాలని కోరుతూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. తొమ్మిది మంది అభ్యర్థులు జర్మనీ వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారని టోమ్‌కామ్ ప్రచారం చేసినప్పటికీ, వారిలో ఒక్కరు కూడా వెళ్లలేదని పేర్కొన్నారు. అభ్యర్థులతో కుదుర్చుకున్న ఒప్పందంలో వివాదాలు తలెత్తితే సుమారు వెయ్యి కిలోమీటర్ల దూరంలోని లక్నో న్యాయస్థానాన్ని ఆశ్రయించాలనే నిబంధన పెట్టడాన్ని ఆయన తప్పుబట్టారు. టోమ్‌కామ్ ద్వారా ఇప్పటివరకు ఎంతమందికి ఉద్యోగాలు కల్పించారో సమాచార హక్కు చట్టం కింద అడిగినా, గడువు ముగిసినప్పటికీ సమాధానం ఇవ్వలేదని ఆరోపించారు. బాధితులు రెండేళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న సమయంలో ఈ ఏడాది జూన్‌లో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి కొత్త టోమ్‌కామ్ బ్యాచ్‌ను ప్రారంభించి ఉద్యోగాలపై హామీలు ఇవ్వడం బాధితులను అవమానించడమేనని హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని, ప్రకటించిన ఉద్యోగాల ప్రణాళిక అమలు ఎక్కడిదాకా వచ్చిందని ప్రశ్నించారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించాల్సిన ప్రభుత్వ సంస్థే ఉద్యోగాల పేరుతో డబ్బులు చెల్లించిన యువతను ఇబ్బందులకు గురిచేస్తోందన్నది తన ప్రధాన ఆరోపణగా పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే స్పందించి బాధితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

డిజిటల్ అరెస్టు మోసం.. ఇద్దరు అరెస్టు

హైదరాబాద్, అక్టోబర్ 18 సిరి న్యూస్



డిజిటల్ అరెస్టు పేరుతో ఓ పదవీ విరమణ పొందిన ఉద్యోగి నుంచి రూ.29.17 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్ల కేసులో ఇద్దరు నిందితులను హైదరాబాద్ నగర సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. అమీర్‌పేటకు చెందిన మొహమ్మద్ అష్ఫాక్ హుస్సేన్, అహ్మద్ నజీబ్ ఉద్దీన్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఈ మోసంలో బెంగళూరుకు చెందిన సచిన్ అనే మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రభుత్వ దర్యాప్తు సంస్థల అధికారులమంటూ బాధితుడిని భయపెట్టి, విచారణ పేరుతో భారీ మొత్తాన్ని తమ ఖాతాలకు బదిలీ చేయించుకున్నట్లు కేసు వివరాలు వెల్లడిస్తున్నాయి.

నిందితులు ఢిల్లీ పోలీసులం, కేంద్ర దర్యాప్తు సంస్థ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులమంటూ బాధితుడిని సంప్రదించినట్లు పోలీసులు తెలిపారు. రూ.6.8 కోట్ల మనీలాండరింగ్ కేసులో ఆయన ప్రమేయం ఉందని, కేసులో ఇరికిస్తామని బెదిరించినట్లు వెల్లడించారు. ఈ ఆరోపణల నుంచి బయటపడాలంటే ధన సంబంధిత వివరాలను ధ్రువీకరించుకోవాలని, విచారణకు సహకరించాలని చెప్పి బాధితుడిని ఒత్తిడికి గురిచేసినట్లు సమాచారం. అధికారిక విచారణ జరుగుతోందనే భయాన్ని కల్పించి, వారు చెప్పినట్లు చేయకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

వెరిఫికేషన్ పేరుతో బాధితుడితోపాటు ఆయన కుమార్తెను కూడా నిందితులు లక్ష్యంగా చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. విచారణ ప్రక్రియలో భాగంగా డబ్బులను బదిలీ చేయాలని నమ్మించి, విడతలవారీగా మొత్తం రూ.29.17 లక్షలు వసూలు చేసినట్లు కేసు వివరాలు సూచిస్తున్నాయి. ప్రభుత్వ సంస్థల పేర్లు, మనీలాండరింగ్ కేసు ప్రస్తావనతో బాధితుడిని తీవ్ర ఆందోళనకు గురిచేసి మోసానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. డిజిటల్ అరెస్టు పేరుతో నేరగాళ్లు ఉపయోగించే బెదిరింపుల పద్ధతిలోనే ఈ వ్యవహారం సాగినట్లు దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.

మోసం ద్వారా వచ్చిన సొమ్మును నిందితులు నేరుగా ఒకే ఖాతాలో ఉంచకుండా, ఇతరుల పేర్లతో ఉన్న మ్యూల్ బ్యాంకు ఖాతాల ద్వారా మళ్లించినట్లు పోలీసులు గుర్తించారు. ఆయా ఖాతాల్లో జమ అయిన మొత్తాలను చెక్కుల ద్వారా నగదు రూపంలో ఉపసంహరించుకుని, అనంతరం ఇతర ఖాతాల్లో జమ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇలా పలు దశల్లో నగదును బదిలీ చేయడం ద్వారా అసలు లబ్ధిదారులను గుర్తించడం కష్టతరం చేయడానికి ప్రయత్నించినట్లు అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారంలో నిందితులు తమ పాత్రకు ప్రతిఫలంగా కమీషన్లు పొందినట్లు పోలీసుల విచారణలో వెల్లడైందని సమాచారం. నేరపూరితంగా సంపాదించిన సొమ్ము ఆనవాళ్లను దాచేందుకు యూఎస్‌డీటీ అనే క్రిప్టో కరెన్సీ ద్వారా కూడా లావాదేవీలు నిర్వహించినట్లు పోలీసులు గుర్తించారు. బ్యాంకు ఖాతాలు, చెక్కుల ద్వారా నగదు ఉపసంహరణ, క్రిప్టో కరెన్సీ లావాదేవీల మధ్య సంబంధాలను పరిశీలిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అరెస్టయిన ఇద్దరు నిందితుల నుంచి లభించిన సమాచారం ఆధారంగా పరారీలో ఉన్న సచిన్ ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. అపరిచిత వ్యక్తులు పోలీసులమని, దర్యాప్తు సంస్థల అధికారులమని ఫోన్ చేసి బెదిరిస్తూ డబ్బులు బదిలీ చేయాలని కోరితే నమ్మవద్దని పోలీసులు సూచిస్తున్నారు. నిజమైన దర్యాప్తు పేరుతో డబ్బులు బదిలీ చేయాలని ఎవరూ కోరరని, ఇలాంటి మోసాలపై వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

టైగర్ ష్రాఫ్‌పై కాల్పులు..

సల్మాన్ ఖాన్‌తో సాన్నిహిత్యమే కారణమా?

ముంబై: బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌ను లక్ష్యంగా చేసుకుని ముంబైలోని జుహు ప్రాంతంలో జరిగిన కాల్పుల ఘటన కలకలం రేపింది. ఈ దాడిలో టైగర్ ష్రాఫ్‌కు ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఆయన సురక్షితంగా బయటపడ్డారు. అయితే ఆయన కారు డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి గాయపడినట్లు సమాచారం. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటన వెనుక లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ హస్తం ఉన్నట్లు ప్రచారం జరగడంతో బాలీవుడ్ ప్రముఖుల్లో ఆందోళన నెలకొంది.

సోషల్ మీడియాలో హెచ్చరికలు

కాల్పుల ఘటనకు తామే బాధ్యులమంటూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధాలున్నట్లు చెప్పుకుంటున్న అనిల్ పండిట్, హర్మాన్ సంధూ పేర్లతో సోషల్ మీడియాలో పోస్టులు, ఆడియో క్లిప్‌లు వెలువడినట్లు కథనాలు పేర్కొంటున్నాయి. టైగర్ ష్రాఫ్‌కు గతంలో హెచ్చరికలు చేసినా పట్టించుకోకపోవడంతోనే దాడికి పాల్పడినట్లు ఆ సందేశాల్లో పేర్కొన్నారని సమాచారం. సల్మాన్ ఖాన్‌తో కలిసి పనిచేసే వారిని కూడా వదిలిపెట్టబోమంటూ హెచ్చరించినట్లు తెలుస్తోంది. అయితే ఈ సందేశాల ప్రామాణికత, దాడితో సంబంధంపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది.

బాబా సిద్దిఖ్ హత్యతో పోలికలు

గతంలో ఎన్సీపీ నేత బాబా సిద్దిఖ్ హత్య వెనుక కూడా సల్మాన్ ఖాన్‌తో ఆయనకు ఉన్న సాన్నిహిత్యం కారణమని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌పై ఆరోపణలు వచ్చాయి. ఇప్పుడు టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల ఘటన నేపథ్యంలో ఆ కేసు మరోసారి చర్చకు వస్తోంది. అయితే రెండు ఘటనల మధ్య సంబంధం ఉన్నట్లు నిర్ధారించే అధికారిక సమాచారం వెలువడలేదు. కాల్పుల ఘటనపై సమాచారం అందుకున్న ముంబై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పోలీస్ కమిషనర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నట్లు సమాచారం. నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తూ, దాడికి పాల్పడినవారి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లు సమాచారం.

చైనా ఏజెంట్లకు రహస్య సమాచారం చేరవేత?..

- **తెలంగాణకు చెందిన ఆర్మీ అధికారి భార్యపై కేసు**
- **విదేశీ నిఘా సంస్థలతో సంబంధాలున్నాయనే ఆరోపణలు**
- **విద్యావేత్తలుగా పరిచయమైన వ్యక్తుల ద్వారా సమాచార సేకరణకు ప్రయత్నం?**
- **వ్యూహాత్మక అంశాలకు సంబంధించిన పత్రాలు, డేటా బదిలీపై అనుమానాలు**
- **అధికారిక రహస్యాల చట్టం కింద జమ్మూలో ఎఫ్ఐఆర్ నమోదు**

జమ్మూ, అక్టోబర్ 18 సిరి న్యూస్:

దేశ రక్షణకు సంబంధించిన కీలక సమాచారాన్ని విదేశీ వ్యక్తులకు చేరవేశారనే ఆరోపణలపై తెలంగాణకు చెందిన ఓ మహిళపై జమ్మూకశ్మీర్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఆమె ఓ సీనియర్ ఆర్మీ అధికారి భార్యగా, ప్రస్తుతం జమ్మూలోని గాంధీ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసిస్తున్నట్లు తెలుస్తోంది. విదేశీ నిఘా సంస్థలతో సంబంధాలున్న వ్యక్తులతో ఆమె సంప్రదింపులు జరిపారనే అనుమానాల నేపథ్యంలో అధికారులు దర్యాప్తు చేపట్టారు. అయితే, ఆమెపై వచ్చిన ఆరోపణలు ఇంకా నిర్ధారణ కావాల్సి ఉంది.

విద్యావేత్తల పేరుతో పరిచయాలు?

ప్రాథమిక దర్యాప్తు వివరాల ప్రకారం.. చైనా నిఘా సంస్థలతో సంబంధాలున్నట్లు అనుమానిస్తున్న కొందరు వ్యక్తులు విద్యావేత్తలుగా పరిచయం చేసుకుని మహిళతో సంబంధాలు ఏర్పరచుకున్నట్లు నిఘా వర్గాలు భావిస్తున్నాయి. తొలుత పర్యావరణం, భౌగోళిక రాజకీయాలపై వ్యాసాలు రాయాలని కోరిన వారు.. ఆ తర్వాత రక్షణ రంగానికి సంబంధించిన అంశాలపై దృష్టి సారించేలా ప్రోత్సహించినట్లు అనుమానిస్తున్నారు. ఈ పరిచయాల ద్వారా ఆమె నుంచి వ్యూహాత్మక ప్రాధాన్యం ఉన్న సమాచారాన్ని సేకరించేందుకు ప్రయత్నించి ఉండవచ్చని దర్యాప్తు అధికారులు భావిస్తున్నట్లు సమాచారం.

ఎలక్ట్రానిక్ డేటా బదిలీపై ఆరా

దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన పత్రాలు, ఫొటోలు, ఎలక్ట్రానిక్ సమాచారాన్ని ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ మార్గాల ద్వారా విదేశీ వ్యక్తులకు పంపించి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో చైనాతో పాటు ఇతర దేశాలకు చెందిన వ్యక్తుల ప్రమేయం ఉందా అనే కోణంలోనూ విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఏయే పత్రాలు బదిలీ అయ్యాయి, ఎవరికి సమాచారం చేరింది, ఎంతమేరకు నష్టం వాటిల్లే అవకాశం ఉందనే వివరాలు ఇంకా స్పష్టంగా వెల్లడి కాలేదు.

అధికారిక రహస్యాల చట్టం కింద కేసు

ఈ వ్యవహారంపై జమ్మూలోని గాంధీ నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నంబర్ 290/2026 నమోదు చేసినట్లు సమాచారం. అధికారిక రహస్యాల చట్టం, 1923లోని సెక్షన్లు 3, 5తో పాటు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) లోని సెక్షన్లు 152, 61(2) కింద కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది. మహిళకు విదేశీ వ్యక్తులతో పరిచయాలు ఎలా ఏర్పడ్డాయి, వారి మధ్య ఎలాంటి సమాచార మార్పిడి జరిగింది.

కీసర మాజీ సీఐ గుట్టు లాగుతున్న ఏసీబీ

- **అక్రమాస్తుల విలువ రూ.20 కోట్లకు పైగానే!**
- **రూ.5 లక్షల లంచం తీసుకుంటుండగా ఏసీబీకి చిక్కిన అరకపల్లి ఆంజనేయులు**
- **ఇళ్లు, భూములు, బంగారం సహా రూ.2.28 కోట్ల ఆస్తుల గుర్తింపు**
- **మార్కెట్ ధరల ప్రకారం ఆస్తుల విలువ రూ.20 కోట్లకు పైనే ఉంటుందని అంచనా**
- **నాలుగు ప్రాంతాల్లో సోదాలు.. మరికొన్ని భూములపై కొనసాగుతున్న దర్యాప్తు**

హైదరాబాద్, అక్టోబర్ 18 సిరి న్యూస్:



లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడిన కీసర మాజీ ఇన్‌స్పెక్టర్ అరకపల్లి ఆంజనేయులు భారీగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు విచారణలో వెలుగులోకి వచ్చింది. ఆయనకు చెందిన ఇళ్లు, స్థలాలు, వ్యవసాయ భూములు, బంగారం తదితర ఆస్తుల విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారం రూ.2.28 కోట్లుగా గుర్తించారు. ప్రస్తుత మార్కెట్ ధరల ఆధారంగా వీటి విలువ రూ.20 కోట్లకు పైగా ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆంజనేయులు, ఆయన బంధువులు, బినామీలకు సంబంధించిన నాలుగు ప్రాంతాల్లో శనివారం తనిఖీలు నిర్వహించి పలు ఆస్తులకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే అభియోగంపై కేసు నమోదు చేసినట్లు ఏసీబీ ప్రకటించింది.

హైదరాబాద్‌తో పాటు నల్గొండ జిల్లాలో ఆస్తులు

ఎల్బీనగర్ పరిసరాల్లో ఆంజనేయులుకు 540 చదరపు గజాల భూమి ఉన్నట్లు గుర్తించారు. హైదరాబాద్‌లోని లింగోజిగూడ, సరూర్‌నగర్ ప్రాంతాల్లో రూ.30 లక్షల విలువైన 150 చదరపు గజాల విస్తీర్ణం కలిగిన రెండు ప్లాట్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. మన్సూరాబాద్‌లో రూ.40 లక్షల విలువైన పాత ఇల్లు ఉన్నట్లు గుర్తించారు. నల్గొండ జిల్లాలోని పేరూరులో రూ.50 లక్షల విలువైన ఇల్లు, మిర్యాలగూడ, హాలియా ప్రాంతాల్లో రూ.80 లక్షల విలువైన రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. వీటితోపాటు హాలియా, మిర్యాలగూడ పరిసరాల్లో మరికొన్ని వ్యవసాయ భూములు ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించి, వాటి వివరాలపై దర్యాప్తు కొనసాగిస్తోంది.

నగదు, బంగారం, కారు స్వాధీనం

ఆంజనేయులుకు సంబంధించిన నివాసాల్లో తనిఖీలు చేపట్టిన అధికారులు రూ.7 లక్షల నగదు, 60 తులాల బంగారం, రూ.6.5 లక్షల విలువైన కారు, రూ.10 లక్షల విలువైన ఇతర వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలను గుర్తించారు. ఆస్తులకు సంబంధించిన పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో లభించిన మరికొన్ని ఆస్తుల వివరాలను పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

రూ.10 లక్షలు అడిగి.. రూ.5 లక్షలకు ఒప్పందం

ఆంజనేయులు లంచం వ్యవహారం ఆగస్టు 31న వెలుగులోకి వచ్చింది. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో లారీలో అక్రమంగా తరలిస్తున్న 650 బస్తాల రేషన్ బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో సయ్యద్ ఇర్షాద్‌ను అదుపులోకి తీసుకుని కీసర పోలీసులకు అప్పగించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పట్లో కీసర ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఆంజనేయులు.. నిందితుడిని అరెస్టు చేయకుండా నోటీసులు జారీ చేసేందుకు రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ఏసీబీ గుర్తించింది. చివరకు రూ.5 లక్షలకు ఒప్పందం కుదిరింది. ఆంజనేయులు ఆదేశాల మేరకు బాధితుడి నుంచి లంచం తీసుకుంటున్న సమయంలో ఎస్ఐ జ్ఞానేందర్ రెడ్డిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ వ్యవహారంలో ఆంజనేయులు పాత్ర కూడా ఉన్నట్లు తేలడంతో ఇద్దరినీ అరెస్టు చేశారు. సెప్టెంబర్ 17న ఆంజనేయులును అరెస్టు చేసి జైలుకు తరలించారు. లంచం కేసులో అరెస్టయిన నెల రోజుల వ్యవధిలోనే ఆయనపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు కావడం గమనార్హం.

తాగునీటి వృథాపై జలమండలి కొరడా





మొదటిపేజీ తరువాయి

ద్వారా అందించే సరఫరాను కూడా నిలిపివేశారు. నీటి దుర్వినియోగం విషయంలో ఫిర్యాదులను పరిశీలించి, ఉల్లంఘనలు నిర్ధారణ అయినప్పుడు సంబంధిత సంస్థలపై చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. జరిమానాలతోపాటు నీటి కనెక్షన్ల తొలగింపు వంటి చర్యలు కూడా ఉంటాయని హెచ్చరించారు.

రానున్న వేసవిలో నీటి లభ్యతపై ఒత్తిడి పెరిగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటిని పొదుపుగా వినియోగించాలని జలమండలి ప్రజలకు సూచించింది. ముఖ్యంగా హోటళ్లు, రెస్టారెంట్లు, పబ్‌లు, ఇతర వాణిజ్య సంస్థలు నీటిని బాధ్యతాయుతంగా ఉపయోగించాలని కోరింది. తాగునీటిని అనవసరంగా వృథా చేయకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంది. నీటి వనరుల పరిరక్షణలో గృహ వినియోగదారులతోపాటు వ్యాపార సంస్థలు కూడా భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేసింది.

నగరంలో ఎక్కడైనా తాగునీటి దుర్వినియోగం జరిగినట్లు గుర్తిస్తే ప్రజలు జలమండలికి ఫిర్యాదు చేయవచ్చని అధికారులు తెలిపారు. ఘటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు, వ్యక్తులు లేదా సంస్థల వివరాలు, ప్రాంతం, పూర్తి చిరునామాతో సహా 99499 30003 వాట్సాప్ నంబర్‌కు పంపాలని సూచించారు. అదేవిధంగా 155313 వినియోగదారుల సేవా నంబర్ ద్వారా కూడా ఫిర్యాదు నమోదు చేయవచ్చని వెల్లడించారు. అందిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి, ఉల్లంఘనలు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫిర్యాదు చేసిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని జలమండలి హామీ ఇచ్చింది. నీటి వృథాను అరికట్టడంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొంది. నీటిని అవసరమైన మేరకే వినియోగించడం, అనవసరంగా పారబోయకుండా చూడటం ద్వారా అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా ఉపయోగించుకోవచ్చని సూచించింది. నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేసింది. తాగునీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, దుర్వినియోగం కనిపిస్తే సంబంధిత వివరాలతో అధికారులకు సమాచారం అందించాలని జలమండలి విజ్ఞప్తి చేసింది.

ఫ్యూచర్ సిటీపై

సీఎం రేవంత్ ఫోకస్..





- *** నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యునానీ మెడిసిన్ క్యాంపస్‌కు శంకుస్థాపన**
- *** మాస్టర్ ప్లాన్, మౌలిక వసతులపై అధికారులతో సమీక్ష**

హైదరాబాద్, అక్టోబర్ 19 సిరి న్యూస్:

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యూచర్ సిటీ అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా సోమవారం ఆయన ఫ్యూచర్ సిటీ పరిధిలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన పోలీస్ కమిషనరేట్‌ను ప్రారంభించడంతో పాటు, నైపుణ్య శిక్షణ సంస్థ పనులను పరిశీలించి, యునానీ వైద్య విద్యకు సంబంధించిన కొత్త క్యాంపస్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

పోలీస్ కమిషనరేట్ ప్రారంభం

ఇబ్రహీంపట్నంలో మధ్యాహ్నం 3.30 గంటలకు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. వేగంగా విస్తరిస్తున్న పారిశ్రామిక, సాంకేతిక రంగాలకు అనుగుణంగా శాంతిభద్రతలను పటిష్టం చేయడంలో ఈ కమిషనరేట్ కీలక పాత్ర పోషించనుంది. అనంతరం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని సందర్శించి, నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో సమీక్షించనున్నారు.

యునానీ మెడిసిన్ క్యాంపస్‌కు శంకుస్థాపన

ఫ్యూచర్ సిటీ పరిధిలో ఏర్పాటు చేయనున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యునానీ మెడిసిన్ (ఎన్ఐయూఎం) నూతన క్యాంపస్ నిర్మాణానికి సీఎం భూమిపూజ చేసి శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా యునానీ వైద్య విద్య, పరిశోధనలకు అవసరమైన మౌలిక వసతులు అభివృద్ధి కానున్నాయి.

అభివృద్ధి ప్రణాళికలపై సమీక్ష

పర్యటనలో చివరగా ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలు, రవాణా అనుసంధానం, భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాలపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించనున్నారు. పర్యటన నేపథ్యంలో ఇబ్రహీంపట్నం, ఫ్యూచర్ సిటీ పరిసరాల్లో అధికారులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు

పారిశుధ్య కార్మికుల సేవలు అమూల్యం: కాల్వగడ్డ రాజ్ కుమార్



- మూతంగి డివిజన్ కార్మికులకు దసరా కానుకలు
- ఆర్‌కేఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీ

రామచంద్రపురం, అక్టోబర్ 18 (సిరి న్యూస్):

పారిశుధ్య కార్మికుల సేవలు సమాజానికి ఎంతో విలువైనవని ఆర్‌కేఎఫ్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు కాల్వగడ్డ రాజ్ కుమార్ అన్నారు. దసరా పండుగను పురస్కరించుకుని ఆదివారం వెలిమేలలోని తన నివాసంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మూతంగి డివిజన్ మున్సిపల్ కార్మికులకు దసరా కానుకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళా కార్మికులకు గద్వాల చీరలు, పురుష కార్మికులకు రేమండ్స్ వస్త్రాలతో పాటు ఒక్కొక్కరికి రూ.500 నగదును అందజేశారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ, నిత్యం ప్రజాసేవలో ఉంటూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. వారి సేవలను గుర్తించి గౌరవించడం సామాజిక బాధ్యతగా భావించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్మికులకు ఎలాంటి కష్టం వచ్చినా ఆర్‌కేఎఫ్ ఫౌండేషన్ తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. దసరా కానుకలు అందుకున్న మున్సిపల్ కార్మికులు కాల్వగడ్డ రాజ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రైవేట్ ఎస్టీపీల నమోదుకు అక్టోబర్ 25 తుది గడువు

- 600 ప్లాంట్లలో 61 మాత్రమే నమోదు
- గడువులోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జలమండలి సూచన

హైదరాబాద్, అక్టోబర్ 18 (సిరి న్యూస్):

హైదరాబాద్ మహానగర జలమండలి పరిధిలోని ప్రైవేట్ మురుగునీటి శుద్ధి ప్లాంట్ల (ఎస్టీపీలు) నమోదుకు అక్టోబర్ 25వ తేదీని తుది గడువుగా నిర్ణయించారు. జలమండలి పరిధిలో సుమారు 600 ప్రైవేట్ ఎస్టీపీలు ఉండగా, ఇప్పటివరకు కేవలం 61 మాత్రమే నమోదయ్యాయి. మిగిలిన ప్లాంట్ల యాజమాన్యాలు గడువులోగా రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని జలమండలి సూచించింది. అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, పరిశ్రమల్లో ఏర్పాటు చేసిన ప్రైవేట్ ఎస్టీపీలు ఈ నమోదు పరిధిలోకి వస్తాయి. ప్లాంట్ల సామర్థ్యం, రోజువారీ శుద్ధి చేస్తున్న మురుగునీటి పరిమాణం, శుద్ధి చేసిన నీటి వినియోగం, మిగులు నీటి లభ్యత వివరాలను సేకరించేందుకు ఈ ప్రక్రియ చేపట్టారు. రానున్న వేసవిలో తాగునీటి వనరులపై ఒత్తిడిని తగ్గించేందుకు నిర్మాణ రంగం, పరిశ్రమలు, ఉద్యానవనాల నిర్వహణ వంటి తాగునీరు అవసరం లేని కార్యకలాపాలకు శుద్ధి చేసిన నీటిని వినియోగించేలా చర్యలు చేపడుతున్నట్లు జలమండలి తెలిపింది. ఇందులో భాగంగా ప్రైవేట్ ఎస్టీపీల్లో లభ్యమయ్యే మిగులు శుద్ధి నీటిని సద్వినియోగం చేసుకోవడంపై దృష్టి సారించింది.

ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్

ప్రైవేట్ ఎస్టీపీల యాజమాన్యాలు జలమండలి అందుబాటులో ఉంచిన ఆన్‌లైన్ సదుపాయం ద్వారా నమోదు చేసుకోవచ్చు. జలమండలి అధికారిక వెబ్‌సైట్: https://hyderabadwater.dawc.in
ప్రైవేట్ ఎస్టీపీల రిజిస్ట్రేషన్ లింక్: https://erphyderabadwater.gov.in/ HmwssbOnlineNew/#/Hmwssb STPConsDetailsCapture
రిజిస్ట్రేషన్ సమయంలో సంస్థ పేరు, చిరునామా, సంప్రదింపు వివరాలు, ఎస్టీపీ సామర్థ్యం, రోజువారీ శుద్ధి చేస్తున్న మురుగునీటి పరిమాణం, శుద్ధి చేసిన నీటి వినియోగం, మిగులు నీటి లభ్యతకు సంబంధించిన వివరాలను నమోదు చేయాలి. అక్టోబర్ 25వ తేదీ తుది గడువు కావడంతో యాజమాన్యాలు చివరి రోజు వరకు వేచి చూడకుండా ప్రక్రియను పూర్తి చేయాలని జలమండలి కోరింది.

వ్యాపార ఆవిష్కరణ, సుస్థిర సమాజంపై గీతంలో అంతర్జాతీయ సదస్సు



- డిసెంబర్ 10, 11 తేదీల్లో బీఐఎస్ఎస్–2026 నిర్వహణ

పటాన్‌చెరు, అక్టోబర్ 18 (సిరి న్యూస్):

హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్‌కు చెందిన సెంటర్ ఫర్ బిజినెస్ గ్రోత్ ఆధ్వర్యంలో రెండవ అంతర్జాతీయ వ్యాపార ఆవిష్కరణ, సుస్థిర సమాజ సదస్సు (బీఐఎస్ఎస్-2026)ను డిసెంబర్ 10, 11 తేదీల్లో నిర్వహించనున్నారు. 'మానవ-యంత్ర అనుసంధానంతో వ్యాపార శ్రేష్ఠత' ఇతివృత్తంతో జరిగే ఈ సదస్సులో విద్యావేత్తలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు పాల్గొననున్నారు. అమెరికాలోని ఎలోన్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ హయా అజ్జన్, పెన్ స్టేట్ హారిస్‌బర్గ్ ప్రొఫెసర్ డాక్టర్ అంగప్ప గుణశేఖరన్ కీలకోపన్యాసాలు చేయనున్నారు. కృత్రిమ మేధస్సు వినియోగం, వ్యాపార ఆవిష్కరణలు, ఉత్పాదకత, సుస్థిరత, సమ్మిళిత అభివృద్ధిపై చర్చలు నిర్వహించనున్నారు. సదస్సులో పరిశోధనా పత్రాల సమర్పణలు, పోస్టర్ ప్రదర్శనలు, ప్యానెల్ చర్చలతో పాటు యూజీ, పీజీ విద్యార్థులకు ప్రత్యేక వేదిక కల్పించనున్నారు. ఎంపికైన పరిశోధనా పత్రాలను స్కోపస్ సూచికల్లో నమోదైన జర్నల్స్‌లో ప్రచురణకు పరిశీలించనున్నారు. ఉత్తమ పత్రాలకు అవార్డులు అందించనున్నారు. సదస్సు సమన్వయకర్తలు డాక్టర్ అజయ్ కుమార్ (88266 99667), డాక్టర్ ఆర్. వీరబాబు (99665 78892)లను సంప్రదించవచ్చు. వివరాలకు biss2026@gitam.in కు ఈమెయిల్ చేయవచ్చు.

అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలి

- నర్సాపూర్ *నియోజకవర్గ ఇంచార్జ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి

కొల్చారం, అక్టోబర్ 18 (సిరి న్యూస్)



మెదక్ జిల్లా కొల్చారం మండలం వరిగుంతం గ్రామంలో హనుమాన్ టెంపుల్ శ్రీ దుర్గా భవాని కమిటీ, పోచమ్మ ఆలయం వద్ద శ్రీ భవాని కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ దుర్గాభవాని అమ్మవారిని ఆదివారం నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ.. దేశంలో, రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో అమ్మవారి ఆశీస్సులతో ప్రజల కష్టాలు, విఘ్నాలు తొలగిపోవాలని కోరుకున్నట్లు తెలిపారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలతో గ్రామాలు సుభిక్షంగా వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఇరు కమిటీల సభ్యులు ప్రతి సంవత్సరం ఇదే విధంగా అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోరారు. అనంతరం ఆవుల రాజిరెడ్డిని ఇరు కమిటీల సభ్యులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగులగారి మల్లేశం గౌడ్, ఉపాధ్యక్షుడు ముత్యంగారి గోవర్ధన్, అచ్చనపల్లి శ్రీరాములు, విజయ్ గౌడ్, చంద్రం, మల్లేశం, మాజీ ఎంపీటీసీ రామకిష్టయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ నగర్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు





- పీఎన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేడుకలు..
- విజేతలకు వెండి పాత్రల బహుమతులు

రామచంద్రాపురం, అక్టోబర్ 18 (సిరి న్యూస్):

రామచంద్రాపురం మందుముల శ్రీనివాస్ నగర్ కాలనీలో పీఎన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పన గేష్ అధ్యక్షతన సండే మార్కెట్‌లో నిర్వహించిన ఈ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. రంగురంగుల బతుకమ్మలతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిగా ఆరు తులాల వెండి పాత్రను శారద, రెండో బహుమతిగా నాలుగు తులాల వెండి పాత్రను రేణుక, మూడో బహుమతిగా రెండు తులాల వెండి పాత్రను ప్రమీల అందుకున్నారు. విజేతలకు బూరుగడ్డ పుష్పనగేష్ బహుమతులు అందజేశారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొనడంతో బతుకమ్మ సంబరాలు వైభవంగా ముగిశాయి.

పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకులు పంపిణీ

- ముఖ్య అతిథులుగా హాజరైన మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి.

కొంపల్లి. అక్టోబర్. 18(సిరి న్యూస్)



సేవా సంకల్ప్ అభియాన్ పురస్కరించుకుని కొంపల్లి డివిజన్ పరిధిలోని పారిశుధ్య, హరితహారం మరియు ఇతర విభాగాలలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు కొంపల్లి బీజేపీ అధ్యక్షుడు పెద్దబుద్ధుల సతీష్ దసరా కానుకగా నిత్యావసర సరుకులను ఆదివారం నాడు తన కార్యాలయం వద్ద పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి, కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు.భారత ప్రధాని నరేంద్రమోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా మరియు దేశప్రధానిగా 25 సంవత్సరాలుగా ప్రజా క్షేత్రంలో అనునిత్యం సేవలందిస్తున్న తరుణంలో రాష్ట్ర పార్టీ సూచన మేరకు కొంపల్లి డివిజన్ అధ్యక్షుడు సతీష్ మున్సిపల్ కార్మికులకు పండుగ భోజన వితరణ కార్యక్రమం నిర్వహించి నిత్యావసరాల సరుకులు పంపిణీ చేయడం అభినందనీయం గత అనేక సంవత్సరాలుగా అనునిత్యం విద్యార్థులకు పేదలకు అందుబాటులో ఉంటూ వారి కష్టనష్టాలలో అండగా నిలుస్తున్న పెద్ద బుద్ధుల సతీష్ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మనస్ఫూర్తిగా దీవించాలని సూచించారు.మున్సిపల్ కార్మికులు లేని నేటి సమాజాన్ని ఊహించుకోలేమని ఉదయం నాలుగు గంటలకు లేచి పరిసర ప్రాంతాలు మరియు రోడ్లు శుభ్రపరుస్తూ, ఆహ్లాదకరమైన వాతావరణం కోసం శ్రమిస్తున్న మున్సిపల్ కార్మికుల సేవలు వెలకట్టలేనివి. దసరా పండుగ సందర్భంగా చిరు కానుక అందివ్వడం నా సామాజిక బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు ఆదిరెడ్డి రాజిరెడ్డి, నాయకులు శివాజీ రాజు, శంకర్ నాయక్, శ్రీనాథ్, శ్యామ్ కిరణ్, కొంపల్లి బి.జె.వై.యం అధ్యక్షులు ఉప్పరి మహేందర్, స్థానిక నాయకులు మధు, పెద్ద బుద్ధుల ఆశ, శ్రీకాంత్, లక్ష్మణ్, శ్రీకాంత్ గౌడ్, కార్మిక సంఘం నాయకులు సత్తయ్య, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేది బతుకమ్మ పండుగ

- ప్రకృతిని ప్రేమిస్తూ.. పూలను పూజించే గొప్ప సంప్రదాయం బతుకమ్మ.
- రామాయంపేట మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా.

రామాయంపేట, అక్టోబర్ 18 (సిరి న్యూస్)



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే గొప్ప పండుగ బతుకమ్మ అని రామాయంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా అన్నారు. ఆదివారం సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా ఆమె బతుకమ్మను పేర్చి, ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఆడపడుచులకు బతుకమ్మ పండుగ ఎంతో ప్రత్యేకమని, ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజించే గొప్ప సంప్రదాయం ఈ పండుగలో కనిపిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు బతుకమ్మ పండుగలో ప్రతిబింబిస్తాయని లావణ్య నాగరాజు గుప్తా అన్నారు. వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మను అందంగా పేర్చి, మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సంబరాలు జరుపుకోవడం తెలంగాణ ప్రత్యేకత అని తెలిపారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ పండుగ మన సంస్కృతిని భావితరాలకు పరిచయం చేస్తుందని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగలో ఉపయోగించే తంగేడు, గునుగు తదితర పూలకు ఔషధ గుణాలు ఉన్నాయని, ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని ఈ పండుగ చాటిచెబుతుందని అన్నారు. పూలతో బతుకమ్మను పేర్చి చెరువుల్లో నిమజ్జనం చేయడం మన సంప్రదాయంలో భాగమని తెలిపారు. పండుగల ద్వారా ప్రకృతిని గౌరవించడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలు, యువతులు, చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటారని, ఈ సంబరాలు కుటుంబాల్లోనూ, సమాజంలోనూ ఆనందాన్ని నింపుతాయని అన్నారు. మహిళల ఐక్యతకు, తెలంగాణ ఆత్మగౌరవానికి బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా కోరారు.

ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు..

- ప్రత్యేక పూజల్లో ఆదర్శ్ రెడ్డి

రామచంద్రాపురం, అక్టోబర్ 18 (సిరి న్యూస్):



పటాన్‌చెరు నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల్లో దేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. రామచంద్రాపురం డివిజన్‌లోని మల్లికార్జున నగర్, శేరిలింగంపల్లి నియోజకవర్గం భారతి నగర్ డివిజన్‌లోని ఓల్డ్ ఎంఐజీ కాలనీ, బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లో నిర్వహించిన ఉత్సవాల్లో పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ, దేవి నవరాత్రులు అమ్మవారి శక్తి, వైభవానికి ప్రతీకలని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఐక్యతను పెంపొందించడంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. కార్యక్రమాల్లో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జగన్నాధ్ రెడ్డి, పరమేశ్ యాదవ్, భాస్కర్ ముదిరాజ్, చిన్న, సురేందర్, సంపత్ గౌడ్, రాకేష్ రెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు. నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులకు, భక్తులకు ఆదర్శ్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా అడుగులు..

- ఎంపీ రఘునందన్ రావు ను కలిసిన కొత్తపల్లి రమేష్

అమీన్పూర్ అక్టోబర్ 18 సిరి న్యూస్



అమీన్పూర్ డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన యువ నాయకులు కొత్తపల్లి రమేష్, పార్టీ శ్రేణుల్లో కొత్త జోష్ నింపుతున్నారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆయన పార్టీ ప్రముఖులను కలుస్తూ ముందుకు వెళుతున్నారు. ఇందులో భాగంగానే మెదక్ పార్లమెంట్ సభ్యులు ఎంపీ రఘునందన్ రావును కొత్తపల్లి రమేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి తన నియమకానికి సహకరించినందుకు మరియు తనకు అండగా నిలిచినందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రమేష్ మాట్లాడుతూ.. కృతజ్ఞతా భావం, తన నియమకానికి సహకరించిన ఎంపీ రఘునందన్ రావు తో పాటు , ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి,పార్టీ నాయకులకు కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టతే లక్ష్యం, అమీన్పూర్ డివిజన్ పరిధిలోని ప్రతి గల్లీలోను బిజెపి బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా ముందుకు వెళ్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఫలం ఆశించని నాయకుడు ఆపదలో అందరివాడు నరేంద్రుడు

వెల్దుర్తి,అక్టోబర్ 18, (సిరి న్యూస్):



సేవ చేయాలనే సంకల్పం ఉంటే పదవులతో సంబంధం లేకుండా సమాజంలో మార్పు తీసుకురావచ్చని నిరూపిస్తున్నారు డీసీసీ ఉపాధ్యక్షులు, హనుమన్నగారి నరేందర్ రెడ్డి. వయోభారంతో పాటు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వృద్ధులకు బాసటగా నిలుస్తూ, వారి జీవితాల్లో ఆత్మీయతను నింపుతున్నారు. గత మూడేళ్లుగా ప్రతి రోజూ రెండు పూటలా భోజనం అందిస్తూ ఆకలితో బాధపడకుండా అండగా నిలుస్తున్నారు. అనారోగ్యంతో ఇళ్లకే పరిమితమైన వృద్ధుల పరిస్థితిని గుర్తించి, వారి ఇంటి వద్దకే భోజనం పంపించడం ద్వారా మానవత్వాన్ని చాటుకుంటున్నారు. ప్రతి దసరా పండుగ సందర్భంగా కొత్త దుస్తులు అందించి, పండుగ వేళ వారి ముఖాల్లో చిరునవ్వులు విరబూయిస్తున్నారు.నేటి సమాజంలో వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను ఆదరించడం కూడా కొందరికి భారంగా మారుతున్న తరుణంలో, రక్తసంబంధం లేని వృద్ధులను సొంత కుటుంబ సభ్యుల్లా భావించి సేవలందించడం నరేందర్ రెడ్డి గొప్ప మనసుకు నిదర్శనం. వారి ఆకలి తీర్చడమే కాకుండా, ప్రేమాభిమానాలను పంచుతూ వారికి కుటుంబ ఆత్మీయతను అందిస్తున్నారు. పదవి కంటే సేవ గొప్పది.. సంపద కంటే మానవత్వం విలువైనది అనే సందేశాన్ని తన ఆచరణ ద్వారా చాటుతున్నారు. వృద్ధుల అవసరాలను గుర్తించి నిరంతరం సహాయం చేయడం ద్వారా సమాజంలో సేవాభావానికి ప్రతీకగా నిలుస్తున్నారు. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా అనునిత్యం సేవ చేయాలనే దృక్పథంతో మండలంలోని అన్ని వర్గాల నాయకులను కార్యకర్తలను కలుపుకొని పోయే మనస్తత్వం గల మహా నాయకుడు హనుమన్న గారి నరేందర్ రెడ్డి అని మండల ప్రజలు నిత్యం గుర్తు చేసుకుంటున్నారు.

ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ



- మెదక్ లో ధూమ్ దాంగా బతుకమ్మ సంబరాలు.
- మహిళలతో కలిసి పూలు పేర్చి.. పాటలు పాడి సందడి..
- సంబరాల్లో పాల్గొన్న పద్మదేవేందర్ రెడ్డి

మెదక్ అక్టోబర్,18(సిరి న్యూస్)



ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ పండుగ అని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం మెదక్ పట్టణంలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. మెదక్ మున్సిపల్ కౌన్సిలర్ మాయ గంగామణి మల్లేశం,
న్యాయవాది మాయ వెంకటేశం కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాలుపంచుకున్నారు.మహిళలతో కలిసి వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ సందడి చేశారు. సంప్రదాయబద్ధంగా సాగిన వేడుకల్లో మహిళలతో మమేకమై పండుగ ఉత్సాహాన్ని పంచుకున్నారు. అనంతరం తిమ్మనగర్ గ్రామం లో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు.

ఆటపాటలతో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు



- గుమ్మడిదల మున్సిపాలిటీ, మండలవ్యాప్తంగా సంప్రదాయబద్ధంగా వేడుకలు

గుమ్మడిదల, అక్టోబర్ 18 (సిరి న్యూస్):



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గుమ్మడిదల మున్సిపాలిటీతో పాటు మండలవ్యాప్తంగా మహిళలు ఆదివారం భక్తి శ్రద్ధలతో ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే గ్రామాలు, పట్టణంలోని వివిధ వార్డుల్లో బతుకమ్మ సంబరాలు ప్రారంభమయ్యాయి. ప్రతి ఇంట్లో మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, గౌరమ్మను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వేళ మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మల చుట్టూ వలయాకారంగా చేరి లయబద్ధంగా చప్పట్లు కొడుతూ జానపద గీతాలు ఆలపించారు. బతుకమ్మ పాటలతో గ్రామాలు, వీధులు మార్మోగాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు మహిళలంతా ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొనడంతో పండుగ వాతావరణం నెలకొంది. ఆటపాటలతో మహిళలు సందడి చేయగా, పూల బతుకమ్మల అందాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం మహిళలు బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్లి సమీపంలోని చెరువుల వద్ద సంప్రదాయబద్ధంగా నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించారు. మహిళలంతా ఒకచోట చేరి సామూహికంగా వేడుకలు నిర్వహించడంతో గ్రామాల్లో పండుగ శోభ వెల్లివిరిసింది. బతుకమ్మ నిమజ్జన సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గుమ్మడిదల మున్సిపాలిటీ అధికారులు చెరువుల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. మహిళలకు అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులతో పాటు మండలంలోని గ్రామాల్లోనూ బతుకమ్మ సంబరాలు వైభవంగా జరిగాయి. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు, పూల ప్రాధాన్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మరోసారి తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పింది. సంప్రదాయాలు, ఆచారాలను కాపాడుకుంటూ మహిళలు ఉత్సాహంగా పాల్గొనడంతో గుమ్మడిదల ప్రాంతమంతా బతుకమ్మ పాటలు, ఆటలతో పండుగ కళను సంతరించుకుంది. గుమ్మడిదలలో ప్రయాణికులకు ఏలాంటి ఇబ్బందులు కలిగించకుండా గుమ్మడిదల ఎస్సై అరుణ్ కుమార్ తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు

గ్రామాల్లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

మునిపల్లి, అక్టోబర్ 18 (సిరి న్యూస్):



బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మునిపల్లి మండల కేంద్రంతో పాటు ఖమ్మంపల్లి, అల్లాపూర్, చీలపల్లి, మల్లికార్జున్‌పల్లి తదితర గ్రామాల్లో ఆదివారం మహిళలు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, డప్పు చప్పుళ్లు, ఆటపాటలతో గ్రామ పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లి సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు. పండుగ సందర్భంగా గ్రామాల్లో సందడి నెలకొంది.ఈ వేడుకల్లో ఆయా
గ్రామాల సర్పంచులు సౌందర్య, పాండు, అంకెన్‌పల్లి నారాయణ, పట్లోళ్ల లక్ష్మీ వీరన్న పాటిల్ తదితరులు పాల్గొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి సౌభాగ్యాలతో జీవించాలని భగవంతుడిని ప్రార్థించారు. వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను ఉత్సాహంగా జరుపుకున్నారు.

అల్మాయి పేటలో వృద్ధ మహిళలకు చీరల పంపిణీ



జోగిపేట, అక్టోబర్ 18(సిరి న్యూస్):

అందోల్ మండల పరిధిలోని అల్మాయి పేట గ్రామంలో మాజీ సర్పంచ్ బుడ్డోల్ల బాలమణి రవిశంకర్, కూతురు దీవెనలు వృద్ధ మహిళలకు దసరా కానుకగా చీరలను పంపిణీ చేశారు. ఆదివారం వారి స్వగృహంలో గ్రామంలోని సుమారుగా 50 మంది పేద వృద్ధ మహిళలను గుర్తించి వారికి దసరా పండగకు సంబంధించి చీరలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని పేద వృద్ధ మహిళల కోసం ప్రతి సంవత్సరం మా వంతు సహకారంగా పండగ కానుకలను అందిస్తున్నామన్నారు. ఇలాంటి సేవ చేయడంలోనే ఆనందం ఉందని వారు అన్నారు.

చేపలు పట్టడానికి వెళ్లి నీట మునిగి వ్యక్తి మృతి....

పెద్ద శంకరంపేట, అక్టోబర్ 18, సిరి న్యూస్



చేపలు పట్టడానికి వెళ్లి నీట మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన పెద్ద శంకరంపేటలో చోటు చేసుకుంది. పేట ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్ద శంకరంపేట చెందిన జొడగిరి బేతయ్య (38) గురువారం మధ్యాహ్నం ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో చుట్టు పక్కల ఎక్కడైనా ఉన్నారేమో వెతకడం జరిగిందన్నారు. పెద్ద శంకరంపేట పట్టణ శివారులోని దయ్యాలకుంటలో చేపలు పట్టడానికి వెళ్లి నీట మునిగిపోయి మృతి చెందడంతో ఆదివారం ఉదయం నీటిపై తేలినాడు అని వివరించారు. చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగిపోయి వచ్చేదినట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య శారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

దుర్గ దేవిగా అమ్మవారి దర్శనం

పెద్ద శంకరంపేట, అక్టోబర్ 18, సిరి న్యూస్

పెద్ద శంకరంపేట తో పాటు ఆయా గ్రామాలలో దీవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం అమ్మవారు శ్రీ దుర్గాదేవి అవతారంలో భక్తులకు ప్రత్యేక దర్శనం ఇవ్వడంతో ఉదయం సాయంత్రం భక్తుడు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దుర్గాదేవి అవతారంలో ఆయా మండపాల నిర్వాహకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మహిళలు భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేస్తున్నారు.


శ్రీ కన్యకా పరమేశ్వరి దేవి శ్రీ దుర్గా మాతగా అవతారం

సదాశివపేట. అక్టోబర్ 18. (సిరిన్యూస్)



సదాశివపేట లోని శ్రీ కన్యక పరమేశ్వరి మందిరంలో శరన్నవరాత్రులలో భాగంగా ఆదివారం నాడు శ్రీ దుర్గా మాత అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వడం జరిగింది. శ్రీ కన్యక పరమేశ్వరి ఆలయంలో కుంకుమార్చన, లలిత సహస్రనామములు, మధ్యాహ్నం హారతి, పాల్గొన్న భక్తులందరికీ మహా ప్రసాదం వితరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న నిర్మల జగ్గారెడ్డి



సదాశివపేట. అక్టోబర్ 18. (సిరిన్యూస్)

సదాశివపేట మండలంలోని నంది కంది గ్రామంలో సర్పంచ్ స్రవంతి విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగను ఘనంగా జరిపారు. మహిళలు ఆటపాటలతో,కోలాటాలతో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిర్మల జగ్గారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ ఆడపడుచులకు బతుకమ్మ పండుగ అతి ముఖ్యమైనదని, కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టిందని అన్నారు. మహిళలు బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో నంది కంది గ్రామ పెద్దలు యువకులు యువతులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

యువత ఏసుప్రభును ఆదర్శంగా తీసుకోవాలి



- యూత్ ఫెస్టివల్ వేడుకలు.
- సి.యస్.ఐ చర్చి యూత్ సెక్రటరీ కె.రవి.

సదాశివపేట. అక్టోబర్ 18. (సిరిన్యూస్)

సదాశివపేట పట్టణంలోని వార్డు నెం.3 లో గల సి.యస్.ఐ చర్చిలో ఘనంగా యూత్ ఫెస్టివల్ వేడుకలు జరిగాయి. మొదటగా సి.యస్. యూత్ సభ్యులందరూ కలిసి సదాశివపేటలోని గవర్నమెంట్ హాస్పిటల్‌లోని పేషెంట్లకు పండ్లు పంపిణీ చేశారు. ఆ తరువాత సి.యస్.ఐ చర్చిలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ సెక్రటరీ కె.రవి ప్రసంగిస్తూ యూత్ అందరూ కూడా యేసు ప్రభువును ఆదర్శంగా తీసుకొని సమాజంలో సేవ చేయాలని మాట్లాడారు. ప్రెస్బిటర్ ఇంచార్జి ఎ.రవి, యూత్ సెక్రటరీ కె.రవి, యూత్ సభ్యులు, పాస్టరేటు కమిటీ సభ్యులు, సంఘస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో మహా చండీయాగం



తూప్రాన్ అక్టోబర్ 18 సిరి న్యూస్

తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని మహంకాళి అమ్మవారి దేవాలయంలో దేవీ నవరాత్రులలో భాగంగా ఆదివారం ఎనిమిదవ రోజున అమ్మవారి సన్నిధిలో చండి హోమం రుద్రాః స్వాహాకర మహా చండీయాగం నిర్వహించారు భక్తులు అధిక సంఖ్యలో చండీ హోమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో చెలిమెల రఘుపతి బజారు చక్రవర్తి పసుల నారాయణ

శ్రీనివాస్ చందు నిర్వాహకులు తాటి వెంకటేశం మహేష్ గౌడ్ నాగరాజుగౌడ్ గడ్డం శ్రీనివాస్ బొడ్డు శ్రీహరి రమ్య మున్నా సంతోష్ మొన్నే భాను ఆనంద్ శ్రవణ్ మధు నరసింహారెడ్డి పోతరాజు నాగరాజు మాసాయి పేట సురేష్ గౌడ్ పాల్గొన్నారు

కొల్చారం మండల వ్యాప్తంగా ఘనంగా సద్దుల బతుకమ్మ



కొల్చారం అక్టోబర్ 18 (సిరి న్యూస్)

బతుకమ్మ పండగను పురస్కరించుకొని కొల్చారం మండల పరిధిలోని అన్నిగ్రామాలతో పాటు మండల కేంద్రమైన కొల్చారం రంగంపేట వరిగుంతం సంగయ్యపేట పైసరవైమాందాపూర్ కిష్టాపూర్ రాంపూర్ తదితర గ్రామాలలో సద్దుల బతుకమ్మ పండుగ నిర్వహించారు మండల కేంద్రమైన కొల్చారంలో హనుమాన్ కాలనీలో ఏర్పాటు చేసిన బతుకమ్మ పండుగ సందర్భంగా స్థానిక హనుమాన్ ఆలయం సమీపంలో మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మలను ఒకే దగ్గర తీసుకువచ్చి ఆట పాటలతో అలరించారు స్థానిక వీరభద్ర ఆలయం శివాలయం ప్రధాన వీధుల వద్ద బతుకమ్మలను తీసుకువచ్చి సాంప్రదాయ పద్ధతిలో సద్దుల బతుకమ్మ పండుగ నిర్వహించారు ఈ కార్యక్రమంలో అఖిలపక్షాల నాయకులు గ్రామ యువజన సంఘాల నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు



తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి!!

శివంపేట అక్టోబర్ 18 (సిరి న్యూస్)



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని మాజీ మంత్రి, నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం శివంపేట మండలంలోని తన స్వగ్రామమైన గోమారంలో సద్దుల బతుకమ్మ సందర్భంగా ఆమె తన కుటుంబ సభ్యులతో కలిసి వివిధ రకాల రంగు రంగుల పూలతో బతుకమ్మను అందంగా అలంకరించారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మ పండుగ శోభను చాటగా, కుటుంబ సభ్యులతో కలిసి సంప్రదాయబద్ధంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి జరుపుకునే ఈ పండుగ తెలంగాణకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిందని తెలిపారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను కాపాడుకుంటూ బతుకమ్మ వేడుకలను భక్తిశ్రద్ధలతో, ఐకమత్యంతో జరుపుకోవాలని సూచించారు. బతుకమ్మ పండుగ మహిళల మధ్య ఆత్మీయతను పెంపొందించడంతో పాటు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కలిసి ఆనందాన్ని పంచుకునే గొప్ప సందర్భమని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే ఇలాంటి పండుగలను భావితరాలకు పరిచయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రకృతిలో లభించే పూలతో బతుకమ్మను అలంకరించి పూజించడం మన సంప్రదాయాల్లోని ప్రత్యేకతను తెలియజేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, బీఆర్ఎస్ నాయకులు హనుమంత్ రెడ్డి, భిక్షపతి రెడ్డి, కుంట లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

నందిగామలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



- సర్పంచ్ ఎల్లగొని విక్రంగౌడ్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు
- సంబరాల్లో పాల్గొన్న ప్రముఖ సింగర్ మంగ్లీ, జంగిరెడ్డి

పటాన్ చెరు, అక్టోబర్ 18, సిరి న్యూస్

పటాన్ చెరు మండలం నందిగామ గ్రామంలో స్థానిక సర్పంచ్ ఎల్లగొని విక్రంగౌడ్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలందరూ ప్రధాన కూడలిలో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ పాటలు పాడుతూ ఆనంద్ ఉత్సవాల మధ్య బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు. యొక్క బతుకమ్మ వేడుకలకు ప్రముఖ సింగర్ మంగ్లీ, జంగిరెడ్డిలు పాల్గొని, బతుకమ్మ ఆటపాటలతో వేడుకను మహిళలతో కలిసి ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. మంగ్లీ ఆట పాటలతో బతుకమ్మ ఉత్సవాలు ఎంతో ఉల్లాసంగా కొనసాగాయి. గ్రామం ప్రధాన కూడలి హనుమాన్ మందిరం నుండి చెరువు కట్ట పరకు మహిళలు బతుకమ్మతో నడిచేందుకు గ్రీన్ మ్యాట్ ను ఏర్పాటు చేశారు. మహిళలందరూ బతుకమ్మ ఆడి గ్రామంలోని చెరువులో వదిలేసి వెళ్లి రావమ్మా అని వీడుకోలు పలికారు. సర్పంచ్ విక్రమ్ గౌడ్ బతుకమ్మ వేడుకలను అన్ని సదుపాయాలతో నిర్వహించారు. సింగర్ మంగ్లీతో ఫోటోలు దిగేందుకు మహిళలు, యువకులు ఆసక్తిని చూపారు. ఈ సందర్భంగా సర్పంచ్ విక్రమ్ గౌడ్ మాట్లాడుతూ.. దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామస్తులందరం కలిసి బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నామని తెలిపారు. అనివర్గాల ప్రజల పండగలను ఆనందోత్సవాల మధ్య జరుపుకుంటామని అన్నారు. గ్రామస్తుల సహకారంతో మునుముందు అన్ని వేడుకలను ఘనంగా జరుపుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం, స్థానిక ఉపసర్పంచ్ గోరేమియా, స్థానిక నాయకులు, మహిళలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

కిష్టాపూర్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి

- పేరూరు గ్రామానికి లింక్ రో డ్డు నిర్మించాలని వినతి
- కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగుల గారి మల్లేశం గౌడ్

కొల్చారం, అక్టోబర్ 18 (సిరి న్యూస్)



కొల్చారం మండలంలోనికిష్టాపూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారితో పాటు పేరూరు గ్రామానికి వెళ్లే లింక్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగులగారి మల్లేశం గౌడ్ నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డిని కోరారు. శనివారం కిష్టాపూర్ గ్రామానికి వచ్చిన ఆవుల రాజిరెడ్డిని గ్రామ కాంగ్రెస్ నాయకులతో కలిసి మల్లేశం గౌడ్ కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న రహదారి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గత పదేళ్లుగా కిష్టాపూర్ ప్రధాన రహదారి అభివృద్ధికి నోచుకోకపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. గ్రామానికి చేరుకోవడానికి ఈ రహదారే ప్రధాన మార్గం కావడంతో ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారని తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కిష్టాపూర్ ప్రధాన రహదారిని రెండు వరుసల రహదారిగా అభివృద్ధి చేసి, గ్రామం నుంచి పేరూరు వెళ్లే లింక్ రోడ్డు నిర్మాణాన్ని కూడా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో నెలకొన్న ఇతర సమస్యలను వివరిస్తూ గ్రామ కాంగ్రెస్ నాయకుల సమక్షంలో వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆవుల రాజిరెడ్డి సానుకూలంగా స్పందించారు. కిష్టాపూర్ ప్రధాన రహదారి, పేరూరు లింక్ రోడ్డు నిర్మాణ సమస్యలను తన దృష్టిలో ఉంచుకున్నామని తెలిపారు. సంబంధిత అధికారులతో పాటు ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామితో మాట్లాడి రహదారుల నిర్మాణం పూర్తయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో ఇతర సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్ద శ్రీశైలం, వార్డు సభ్యులు పెద్దల కిషన్, తోష నవీన్, ఎంబరి మల్లేశం, కాంగ్రెస్ నాయకులు భాస్కర్, మల్కా ప్రవీణ్, వెంకటేశం, ప్రభాకర్, కుమార్, పెద్ది నరేష్, గావ్ కాని పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

సంబరంగా సద్దుల బతుకమ్మ సంబరాలు



- వాడ వాడల పూలవనం

వెల్దుర్తి, అక్టోబర్18(సిరి న్యూస్):



తెలంగాణ రాష్ట్రంలో అట్టహాసంగా జరుపుకునే బతుకమ్మ సంబరాల్లో వెల్దుర్తి మండల పరిధిలోని నెల్లూరు, లింగాపూర్, రామయపల్లి, శెట్టిపల్లి, ఎలుకపల్లి, ఏదులపల్లి, మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళలలు బతుకమ్మ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం లో ప్రత్యేకంగా తొమ్మిది రోజులు బతుకమ్మ వేడుకలు జరుపు కోవటం ఆనవాయితీ అని, ఈ విధంగా మహిళలందరూ ఏకమై ఆట,పాటల తోటి బతుకమ్మలు జరుపుకుంటారని, అందరూ కలిసి సంతోషంగా పూజలు జరపటం, నిమజ్జనం చేస్తారని దీని ద్వారా అందరూ ఏకతాటిపై ఉంటున్నారని ఆనందం వ్యక్తం చేశారు. మహిళలతోపాటు కోలాటం, నృత్యం వంటి ఆటపాటలతో పాల్గొన్నారు. బతుకమ్మ సంబరాల కోసం గ్రామాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రామ సర్పంచ్ లను మహిళలు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బతుకమ్మ చీరలేవీ.. మహిళలకు ఇదేనా కానుక?

- పేట మండల బిజెపి అధ్యక్షుడు మండల శ్రావణ్ కుమార్

పెద్దశంకరంపేట, అక్టోబర్ 18 (సిరి న్యూస్):



తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సమీపించిన వేళ పెద్దశంకరంపేట మండలంలోని మహిళల్లో తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ప్రతి ఏటా పేద మహిళలకు కానుకగా అందించే బతుకమ్మ చీరలు ఇప్పటివరకు పంపిణీ చేయకపోవడంతో వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అసలు బతుకమ్మ చీరలు ఎక్కడున్నాయని, పండుగ వేళ ప్రభుత్వం మహిళలను ఎందుకు విస్మరించిందని ప్రశ్నిస్తున్నారు.

అందని బతుకమ్మ చీరలు

మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని రేషన్ దుకాణాల వద్ద ఇప్పటివరకు చీరల పంపిణీ ప్రారంభం కాలేదు. బతుకమ్మ అంటేనే ఆడబిడ్డల పండుగని, ప్రభుత్వం అందించే చీరల కోసం ఆశగా ఎదురుచూస్తున్నామని మహిళలు వాపోతున్నారు. అధికారుల జాప్యంతో నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు చీరలు ఎందుకు రాలేదని, పంపిణీ ఎప్పుడు చేస్తారని అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రశ్నిస్తున్నారు. గతంలో పండుగకు ముందే అందాల్సిన చీరలు ఇప్పటికీ రాకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే బతుకమ్మ చీరలు పంపిణీ చేసి పేద మహిళల ఇళ్లలో ఆనందం నింపాలని కోరుతున్నారు.

మహిళల మన్ననలు పొందిన మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య గుప్త

- మల్లెచెరువు వద్ద బతుకమ్మ సంబరాలకు భారీ ఏర్పాట్లు.
- మహిళలకు మెరుగైన వసతులు..
- భద్రత కోసం పోలీసుల ప్రత్యేక చర్యలు.
- ఏర్పాట్లపై హర్షం వ్యక్తం చేసిన మహిళలు..
- ఎమ్మెల్యే రోహిత్ రావుకు కృతజ్ఞతలు.



ర్‌పర్సన్ లావణ్య

రామాయంపేట, అక్టోబర్ 18 (సిరి న్యూస్)

బతుకమ్మ పండుగను మహిళలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేలా రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన ప్రత్యేక ఏర్పాట్లపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి సౌకర్యాలు కల్పించడంపై మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్త ఆధ్వర్యంలోని పాలకవర్గ సభ్యులను మహిళలు అభినందించారు. మహిళల ఇబ్బందులను గుర్తించి, పండుగ వేడుకలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవడంపై చైర్‌పర్సన్‌కు ప్రత్యేక ప్రశంసలు లభిస్తున్నాయి. గతంలో మల్లెచెరువు వద్ద బతుకమ్మ ఆడేందుకు వెళ్లే మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. కనీసం నడుచుకుంటూ వెళ్లేందుకు సరైన రహదారి లేకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారు. అయితే, ఈసారి మహిళల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మల్లెచెరువు ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో పాటు వీధిలైట్లు ఏర్పాటు చేశారు. బతుకమ్మ నిమజ్జనానికి ఘాట్లు, మహిళలు సేదతీరేందుకు టెంట్లు, బతుకమ్మ ఆడేందుకు అనువైన గ్రౌండ్‌ను సిద్ధం చేశారు. అదనంగా డీజే సౌండ్, ఆకర్షణీయమైన లైటింగ్ ఏర్పాట్లతో పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చారు.

మహిళల ఇబ్బందులకు పరిష్కారం చూపిన చై-

గతంలో ఎదురైన సమస్యలను గుర్తించి, ఈసారి పండుగకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య గుప్త ప్రత్యేక శ్రద్ధ చూపడంపై మహిళలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మహిళలు కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా బతుకమ్మ సంబరాల్లో పాల్గొనేలా ఏర్పాట్లు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. మల్లెచెరువు ప్రాంతంలో రహదారి, విద్యుత్ దీపాలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడంతో గతంలో ఎదురైన ఇబ్బందులు చాలావరకు తొలగిపోయాయని తెలిపారు.

మహిళల భద్రతకు పోలీసుల ప్రత్యేక ఏర్పాట్లు

బతుకమ్మ వేడుకల్లో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎస్సై బాలరాజు ఆధ్వర్యంలో పోలీసు శాఖ చేపట్టిన ప్రత్యేక ఏర్పాట్లపై కూడా మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. పండుగకు పెద్ద సంఖ్యలో మహిళలు హాజరయ్యే నేపథ్యంలో భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ప్రత్యేక దృష్టి సారించడాన్ని అభినందించారు. మున్సిపల్ పాలకవర్గం కల్పించిన సౌకర్యాలకు తోడు పోలీసు శాఖ తీసుకున్న చర్యలు వేడుకల్లో మహిళలకు భరోసానిచ్చాయని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే రోహిత్ రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు

బతుకమ్మ వేడుకలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో చొరవ చూపిన ఎమ్మెల్యే రోహిత్ రావుతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్త, పాలకవర్గ సభ్యులకు మహిళలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మహిళల భద్రత కోసం చర్యలు తీసుకున్న ఎస్సై బాలరాజు, పోలీసు సిబ్బందిని అభినందించారు. గతంలో ఎదురైన ఇబ్బందులను గుర్తు చేసుకుంటూ, ఈసారి సౌకర్యవంతంగా బతుకమ్మ సంబరాలు జరుపుకునే అవకాశం కల్పించిన నూతన మున్సిపల్ పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా బతుకమ్మ సంబరాలు
- తీరొక్క పూలతో బతుకమ్మల పేర్పు.. ఆటపాటలతో సందడి

మెదక్ అక్టోబర్,18(సిరి న్యూస్)





తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబరాలు ఆదివారం మెదక్ జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో... బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ మహిళలు ఆడపపడుచులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆట పాటలతో ఉత్సాహంగా పాల్గొన్నారు.జిల్లాతో పాటు వెల్దుర్తి మండలం మన్నెవర్ జలల్ పూర్ లో యువతులు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకొన్నారు. మహిళల ఆటపాటలు, బతుకమ్మ పాటలతో బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించే ఈ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానంతో ముడిపడి ఉందన్నారు. తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. బతుకమ్మ వేడుకలు మహిళల మధ్య ఐక్యతను, ఆప్యాయతను పెంపొందించడంతోపాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెబుతాయని పేర్కొన్నారు. సంప్రదాయ బతుకమ్మ పాటలు,ఆటపాటలతో ఊరువాడలు దద్దరిల్లాయి.

రామాయంపేటలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకల

- ఆటపాటలతో బతుకమ్మ సంబరాలు
- రామాయంపేట మున్సిపాలిటీ, మండలవ్యాప్తంగా సంప్రదాయబద్ధంగా బతుకమ్మకు పూజ లు

రామాయంపేట, అక్టోబర్ 18 (సిరి న్యూస్):



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను రామాయంపేట మున్సిపాలిటీతో పాటు మండలవ్యాప్తంగా మహిళలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే గ్రామాలు, పట్టణంలోని వివిధ వార్డుల్లో బతుకమ్మ సంబరాలు ప్రారంభమయ్యాయి. ప్రతి ఇంట్లో మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, గౌరమ్మను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వేళ మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మల చుట్టూ వలయాకారంగా చేరి లయబద్ధంగా చప్పట్లు కొడుతూ జానపద గీతాలు ఆలపించారు. బతుకమ్మ పాటలతో గ్రామాలు, వీధులు మార్మోగాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు మహిళలంతా ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొనడంతో పండుగ వాతావరణం నెలకొంది. ఆటపాటలతో మహిళలు సందడి చేయగా, పూల బతుకమ్మల అందాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం మహిళలు బతుకమ్మలను సమీపంలోని చెరువుల వద్ద సంప్రదాయబద్ధంగా నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించారు. మహిళలంతా ఒకచోట చేరి సామూహికంగా వేడుకలు నిర్వహించడంతో గ్రామాల్లో పండుగ శోభ వెల్లివిరిసింది. బతుకమ్మ నిమజ్జన సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపాలిటీ చైర్ పర్సన్ లావణ్య నాగరాజు చెరువుల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. మహిళలకు అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకున్నారు. రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులతో పాటు మండలంలోని గ్రామాల్లోనూ బతుకమ్మ సంబరాలు వైభవంగా జరిగాయి. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు, పూల ప్రాధాన్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మరోసారి తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పింది. సంప్రదాయాలు, ఆచారాలను కాపాడుకుంటూ మహిళలు ఉత్సాహంగా పాల్గొనడంతో రామాయంపేట ప్రాంతమంతా బతుకమ్మ పాటలు, ఆటలతో పండుగ కళను సంతరించుకుంది.

సాంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగ

- కుర్తివాడలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి.. పాడిన మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి.
- దుర్గామాతకు ప్రత్యేక పూజలు. పద్మా దేవేందర్‌రెడ్డికి ఉత్సవ కమిటీ సన్మానం.



పాపన్నపేట్ అక్టోబర్ 18 సిరి న్యూస్ : పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించే గొప్ప సంస్కృతి తెలంగాణ ప్రజలదని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి అన్నారు. సద్దుల బతుకమ్మను పురస్కరించుకుని ఆదివారం పాపన్నపేట మండలం కుర్తివాడలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు.మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ, పాటలు పాడుతూ సందడి చేశారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు సంప్రదాయ గీతాలు ఆలపిస్తూ ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు.

ఈ సందర్భంగా పద్మా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.బతుకమ్మ వేడుకలు తెలంగాణ సంస్కృతి వైభవాన్ని చాటిచెబుతాయని తెలిపారు.అనంతరం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు పద్మా దేవేందర్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు, జగన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి ,కుర్తివాడ మాజీ సర్పంచ్ లు స్రవంతి శ్రీనివాస్,మాజీ సర్పంచ్ కిష్టాగౌడ్ గ్రామ అధ్యక్షులు వెంకటేశం, మాజీ ఏడుపాయల డైరెక్టర్ మోహన్ రావు మాజీ ఉపసర్పంచ్ పోతా గౌడ్, నాయకులు సోములు, సిద్ధిరామిరెడ్డి,బాల్ రెడ్డి వడ్ల బ్రహ్మం కమ్మరి బ్రహ్మం మంగలి బొందయ్య వడ్ల మధు విల్సన్, సాయి వర్ధన్ గౌడ్,కాదూరి రాజు, సామెల్,సతీష్ రావు, మల్లేశం, దత్తు, తదితరులు పాల్గొన్నారు.

దొంతి గ్రామంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



శివంపేట్ అక్టోబర్ 18(సిరి న్యూస్)

ఎన్నో సంవత్సరాల నుండి దొంతి గ్రామంలో దొరవారి బతుకమ్మ సాంప్రదాయంగా ఎంతో ఘనంగా నిర్వహిస్తారు ప్రత్యేకంగా భగవంతునితో సమానంగా బతుకమ్మ అమ్మవారిని కొలుస్తారు కాబట్టి బతుకమ్మ అమ్మవారిని సేవ లో బతుకమ్మను చెరువు వరకు తీసుకెళ్లి పార్వతీ పరమేశ్వరుల పూజలు అందుకొని నిమజ్జనా కార్యకం చేపడుతారు నిమజ్జన కార్యక్రమం చేపడతారు ఇట్టి కార్యక్రమం దొంతి దొర గడి ముందర

చిన్నగొట్టిముక్ల గ్రామంలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు!!

శివంపేట అక్టోబర్ 18 (సిరి న్యూస్)



శివంపేట మండల పరిధిలోని చిన్న గొట్టిముక్ల గ్రామంలో సద్దుల బతుకమ్మ పండుగ వేడుకలను మహిళలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సందర్భంగా గ్రామంలో పండుగ శోభ సంతరించుకుంది. గ్రామంలోని మహిళలు రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. గ్రామంలోని మహిళలందరూ ఒకచోట చేరి బతుకమ్మల చుట్టూ తిరుగుతూ సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. చిన్నగొట్టిముక్ల గ్రామంలో సద్దుల బతుకమ్మ సంబరాలు ఆనందోత్సాహాల మధ్య కొనసాగడంతో గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. అనంతరం బతుకమ్మలను ఊరేగింపుగా గ్రామంలోని చెరువు వద్దకు తీసుకెళ్లి సంప్రదాయ ఆచారాల ప్రకారం నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా మహిళలు “పోయిరావమ్మా బతుకమ్మా.. మళ్లీ వచ్చే ఏడాది రావమ్మా” అంటూ బతుకమ్మకు భక్తి భావంతో వీడ్కోలు పలికారు. పూలతో బతుకమ్మను పేర్చి ప్రకృతిని ఆరాధించే సంప్రదాయాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నారాయణరావు, ఉపసర్పంచ్ పాపయ్య చారి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు బతుకమ్మ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ ప్రతి సంవత్సరం బతుకమ్మ వేడుకలను ఐకమత్యంతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నారాయణరావు, ఉపసర్పంచ్ పాపయ్య చారి, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ మహిళలు, యువతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.చిన్నగొట్టిముక్ల గ్రామంలో సద్దుల బతుకమ్మ సంబరాలు విజయవంతంగా ముగియడంతో గ్రామంలో పండుగ సందడి నెలకొంది.

సొంత డబ్బులతో రోడ్ల మరమ్మతులు



- చేయించిన వైస్ చైర్మన్ సమత కాశిరెడ్డి

తూప్రాన్ అక్టోబర్ 18 సిరి న్యూస్

తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని 6 వ వార్డులో ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వార్డు కౌన్సిలర్ తూప్రాన్ మున్సిపల్ వైస్ చైర్మన్ కొక్కొండ సమత కాశిరెడ్డి ఆదివారం తన సొంత ఖర్చులతో రోడ్ల మరమ్మతులు చేయించారు. వార్డులో రోడ్లు దెబ్బతినడంతో ప్రజలు వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన ఆమె ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మరమ్మతు పనులు చేయించారు ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తూ ప్రజల సౌకర్యమే లక్ష్యంగా దేనికి వెనుకాడకుండా ప్రజాప్రతినిధిగా ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడం తన బాధ్యత అని సమత కాశిరెడ్డి తెలిపారు సొంత నిధులతో రోడ్ల మరమ్మతులు చేయించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుండి పనిచేస్తున్న వైస్ చైర్మన్ కొక్కొండ సమత కాశిరెడ్డి సేవలను స్థానికులు అభినందించారు.



శంకరంపేట మండలం అన్నీ గ్రామాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- **సంప్రదాయ దుస్తుల్లో మహిళలు.. బతుకమ్మ పాటలతో మార్మోగిన గ్రామాలు**

సిరి వార్తలు అక్టోబర్ 18
శంకరంపేట ఆర్, మెదక్ జిల్లా:



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను శంకరంపేట ఆర్ మండలం పరిధిలోని అన్ని గ్రామాల మహిళలు ఉత్సాహంగా జరుపుకున్నారు. సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి వేడుకల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. పండుగ వాతావరణంతో గ్రామాలో ఆహ్లాదకరమైన సందడి నెలకొంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, పూల పండుగ వైభవానికి బతుకమ్మ వేడుకలు అద్దం పట్టాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని ఈ వేడుకలు చాటిచెప్పాయి. మహిళల ఉత్సాహంతో గ్రామాలో పండుగ వాతావరణం నెలకొంది.





పూల పండుగకు గొరిల్లా వేషధారణ ప్రత్యేక ఆకర్షణ



- **అన్నారంలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు**

మెదక్, అక్టోబర్ 18 సిరి న్యూస్

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగను మెదక్ జిల్లా పాపన్నపేట మండలం అన్నారం గ్రామంలో మహిళలు ఆడపడుచులు ఘనంగా నిర్వహించారు. రంగు రంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో మహిళలు వేడుకల్లో పాల్గొని గ్రామంలో పండుగ శోభను నింపారు. సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ వేడుకల్లో గొరిల్లా వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పండుగ సందర్భంగా గొరిల్లా వేషంలో వచ్చిన వ్యక్తులు ప్రత్యేక వేషధారణతో అందరి దృష్టిని ఆకర్షించారు. సాధారణంగా బతుకమ్మ వేడుకల్లో పూల బతుకమ్మలు, సంప్రదాయ నృత్యాలు, మహిళల ఆట పాటలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుండగా, గొరిల్లా వేషధారణతో వేడుకలకు మరింత సందడి చేకూరింది. ఈ వినూత్న వేషధారణ పండుగ వాతావరణంలో ప్రత్యేకతను తీసుకొచ్చింది. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలు గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళల ఆటపాటలు, బతుకమ్మ పాటలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు, పూల పండుగ విశిష్టతకు సద్దుల బతుకమ్మ వేడుకలు అద్దం పట్టాయి. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను కొనసాగిస్తూ మహిళలు భక్తిశ్రద్ధలతో బతుకమ్మను కొలిచారు. కుటుంబాలు, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ గ్రామీణ జీవనంలో ఐక్యతను, ఆత్మీయతను పెంపొందిస్తోంది. సంప్రదాయ బతుకమ్మ వేడుకలకు వినూత్న వేషధారణ తోడవడంతో అన్నారం గ్రామంలో సద్దుల బతుకమ్మ సంబరాలు మరింత సందడిగా సాగాయి.



పటాన్‌చెరులో అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు





- **సాకి చెరువు కట్టపై పోటెత్తిన మహిళలు..**
- **రచ్చ రవి బృందం ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణ**
- **విజేతలకు రూ.50 వేల నగదు బహుమతులు, పట్టు చీరల ప్రదానం**

పటాన్‌చెరు, అక్టోబర్ 18 (సిరి న్యూస్):

పటాన్‌చెరులో సద్దుల బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి (జీఎంఆర్) ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సాకి చెరువు కట్టపై నిర్వహించిన వేడుకలకు వేలాదిగా మహిళలు తరలివచ్చారు. రంగురంగుల బతుకమ్మలు, జానపద గీతాలు, సంప్రదాయ నృత్యాలతో ప్రాంగణం సందడిగా మారింది. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన వేడుకలు రాత్రి 11 గంటల వరకు కొనసాగాయి.

బతుకమ్మ తెలంగాణ సంస్కృతికి ప్రతీక

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ.. ప్రకృతిని ప్రేమిస్తూ పూలను పూజించే అరుదైన పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో గత 15 ఏళ్లుగా ఈ సంబరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల ఆదరణతో వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు.

రచ్చ రవి బృందం ప్రదర్శనలు

ప్రముఖ నటుడు, హాస్య కళాకారుడు రచ్చ రవి నేతృత్వంలోని బృందం సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. కాజీపల్లి భరత్ ఆధ్వర్యంలో బతుకమ్మ పాటలు, జానపద సంగీత కార్యక్రమాలు నిర్వహించారు.

విజేతలకు నగదు బహుమతులు, పట్టు చీరలు

ఉత్తమ బతుకమ్మల పోటీల్లో ప్రథమ బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు, తృతీయ బహుమతిగా రూ.10 వేలు అందజేశారు. విజేతలకు నగదుతో పాటు పట్టు చీరలను, మరో 15 మంది మహిళలకు కన్సోలేషన్ బహుమతులతో పాటు పట్టు చీరలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి, ఆయన కుమార్తె, కోడలు, మనుమరాళ్లు మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, మహిళలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.





వైభవంగా శ్రీ బగలాముఖి అమ్మవారి పల్లకి సేవ!



- **మంగళహారతులతో స్వాగతం పలికిన మహిళలు!!**

శివంపేట్ అక్టోబర్ 18 (సిరి న్యూస్)

శివంపేట మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ బగలాముఖి అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా శివంపేట గ్రామంలో శ్రీ బగలాముఖి అమ్మవారి పల్లకి సేవను వైభవంగా నిర్వహించారు. బగలాముఖి ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అమ్మవారి పల్లకిని గ్రామంలో ఊరేగించారు. పల్లకి సేవ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొనగా, భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గ్రామ వీధుల్లో అమ్మవారి పల్లకి ఊరేగింపు సాగుతుండగా మహిళలు భక్తిశ్రద్ధలతో మంగళహారతులు సమర్పించి అమ్మవారికి ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారి పల్లకిని దర్శించుకునేందుకు గ్రామ ప్రజలు ఆసక్తిగా పాల్గొనడంతో పల్లకి సేవ భక్తిమయ వాతావరణంలో కొనసాగింది. దేవీ నవరాత్రి ఉత్సవాలు హిందూ సంప్రదాయంలో విశేష ప్రాధాన్యత కలిగినవని, ఈ పవిత్ర రోజుల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో ఆరాధిస్తూ భక్తులు తమ భక్తిని చాటుకుంటారని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు పేర్కొన్నారు. శ్రీ బగలాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలో పల్లకి సేవ చేపట్టడం ద్వారా భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించడంతో పాటు గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పెంపొందించారు. పల్లకి సేవలో మహిళలు మంగళహారతులతో పాల్గొనడం, భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రార్థనలు చేయడం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామ ప్రజలందరూ కలిసికట్టుగా ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ఐక్యత, ఆధ్యాత్మిక భావన మరింత బలపడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో నిర్వహించే ప్రత్యేక పూజలు, గ్రామంలో జరిగే ఊరేగింపులు భక్తుల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు తరతరాలుగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక సంప్రదాయాలను కాపాడేందుకు దోహదపడుతున్నాయి. ఇలాంటి ఉత్సవాలు గ్రామ ప్రజలను ఒకచోట చేర్చి పరస్పర సాన్నిహిత్యాన్ని పెంచుతాయని, యువత కూడా ధార్మిక కార్యక్రమాల్లో భాగస్వాములై సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేయాలని పలువురు పేర్కొన్నారు. శివంపేటలో శ్రీ బగలాముఖి అమ్మవారి పల్లకి సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఆలయ ఉపాసకులు, ట్రస్ట్ సభ్యులు, గ్రామ ప్రజలు సహకరించారు. ఈ కార్యక్రమంలో బగలాముఖి ట్రస్ట్ సభ్యులు, ప్రముఖ సంఘసేవకులు పబ్బా మహేష్ గుప్తా, పత్రాల శ్రీనివాస్ గౌడ్, శివంపేట గ్రామ సర్పంచ్ రాజీపేట వెంకటేశ్వర్, ఉపసర్పంచ్ ఇసుగారి మల్లేశం, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, పబ్బా మహేష్ గుప్తా యువసేన సభ్యులు, శ్రీ బగలాముఖి అమ్మవారి భక్తులు, మహిళలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు. దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో విజయవంతంగా కొనసాగాలని, అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని భక్తులు ప్రార్థించారు.

నర్సాపూర్ లో ఘనంగా సద్దుల బతుకమ్మ





- **బతుకమ్మ ఆడిన మున్సిపల్ చైర్మన్**
- **వీధి దీపాల ఏర్పాటుపై మహిళలు హర్షం.**

నర్సాపూర్, అక్టోబర్ 18 (సిరి న్యూస్)

దేవుళ్ళను పూలతో పూజించే మన దేశంలో పూలను పూజించే సంప్రదాయం మాత్రం తెలంగాణ రాష్ట్రంలో ఉంది. రంగు రంగులతో పూలతో ఒకటిగా చేర్చి బతుకమ్మగా కొలుస్తారు తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలలో భాగంగా నర్సాపూర్ పట్టణంలో ఆదివారం సద్దుల బతుకమ్మ ఘనంగా జరిగాయి.ఈ బతుకమ్మ వేడుకలలో మున్సిపల్ చైర్మన్ లక్ష్మి రాజు యాదవ్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ అవుల రాజిరెడ్డి మహిళా కౌన్సిలర్లు పాల్గొన్నారు. పట్టణంలో గల్లి గల్లి లో బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటాయి బతుకమ్మ పండుగను, యువతులు మహిళలు చిన్నారులతో బతుకమ్మ పాటలు పాడుతూ, సంప్రదాయ ఆటలు ఆడుతూ సంబరాలు ఉత్సాహంగా జరుపుకున్నారు బతుకమ్మ వేడుకలు ఈ సందర్భంగా మున్సిపల్ పాలకవర్గం మహిళలకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.మహిళలకు ఇబ్బందుల లేకుండా మున్సిపల్ కమిషనర్ సాయి కుమార్ పాలకవర్గం ఆధ్వర్యంలో పండగకు అన్ని ఏర్పాట్లు చేసింది రాయరావు చెరువు సమీపంలో బతుకమ్మవేడుకలతోపండుగ వాతావరణం నెలకొంది.బతుకమ్మనిమజ్జనానికి ప్రధాన కేంద్రంగా ఉన్న రాయరావు చెరువు దగ్గర ప్రస్తుతం మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో రోడ్డు నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు చేపట్టడంతో బతుకమ్మలను తీసుకెళ్లేందుకు సౌకర్యంగా మారిందని మహిళలు సంతోషం వ్యక్తం చేశారు., ప్రస్తుతం ఏర్పాట్లు బాగున్నాయని పేర్కొన్నారు. సౌకర్యాలు కల్పించిన మున్సిపల్ పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. బతుకమ్మ నిమజ్జనాల కోసం మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపాలిటీ పరిధిలోని చెరువు వద్ద సీసీ కెమెరాల, లైట్లు ఏర్పాటు చేరారు

చెరువుల వద్ద పోలీసు బందోబస్తు

బతుకమ్మ సంబరాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాపిక్ నియత్రణ ,చెరువుల వద్ద బందోబస్తు నిర్వహించారు నిమజ్జనానికి వచ్చే మహిళలకు ఇబ్బందులు కలగకుండా, రద్దీని నియంత్రిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు చేపట్టారు.రాయరావు వద్ద రోడ్డు శుభ్రం, వీధి దీపాల ఏర్పాటు వంటి సౌకర్యాలతో బతుకమ్మ సంబరాలు మరింత సౌకర్యవంతంగా మారాయని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. పండుగ వేళ మహిళలకు మెరుగైన సదుపాయాలు కల్పించడంపై మున్సిపల్ పాలకవర్గాన్ని అభినందిస్తున్నారు.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.

www.siridaily.com

RNI TG TEL/ 26/A0381

సిరి

People's Voice వార్తపత్రిక

సోమవారం
అక్టోబర్-19-2026

సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 289

పేజీలు : 2



మందు కొంటే.. మటన్ ఫ్రీ!

ఇదెక్కడి ఆఫర్ భయ్యా..వైరల్ ప్లెక్సీ రచ్చ

- తోటి వ్యాపారులు లబోదిబో..ఎక్సైజ్ శాఖ నిద్రమత్తు
- హౌస్ ఆఫ్ స్పిరిట్ వైన్స్ ఆఫర్ పై నేటిజన్ల హాట్ చర్చ
- ఈ పద్ధతి కొనసాగితే ప్రతి వైన్స్ షాప్ మూసుకోవాల్సిందే..
- సరుకు మిగిలిపోయిందా? లేదా ఎక్సైరీ దాటిందా?
- వైరల్ ఆఫర్ పై సర్వత్ర అనుమానాలు
- బీరంగూడలో హౌస్ ఆఫ్ స్పిరిట్ దసరా ధమాకా

హౌస్ ఆఫ్ స్పిరిట్ వైన్స్ దసరా ధమాకా.. మందు బాబులకు పండగ



దసరా ముసుగులో భారీ ఆఫర్..

పండుగ రోజు తరుణంలో కస్టమర్లను ఎగబడేలా చేయడానికి మందు కొంటె మటన్ ఫ్రీ అంటూ ఏకంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేసి బహిరంగంగానే లిక్కర్ మాటు ముందు ప్రచారం చేసుకుంటున్నారు. ఈ విచిత్రమైన ఆఫర్ స్థానికంగా హాట్ టాపిక్ గా మారింది.

2

ఆఫర్ల జోరు.. సోషల్ మీడియా హోరు.. మద్యం విక్రయాలను పెంచుకునేందుకు వ్యాపారులు రకరకాల సరికొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. ఇందులో భాగంగానే మందు కొంటే మటన్ ఫ్రీ అంటూ ఏర్పాటుచేసిన ఒక ఫ్లెక్సీ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో జరుగుతున్నాయా అనుకుంటే పొరపాటే, సరిగ్గా రద్దీగా ఉండే బీరంగూడ ప్రధాన రహదారి నడిబొడ్డున ఉన్న హౌస్ ఆఫ్ స్పిరిట్ వైన్ షాప్ యాజమాన్యం ఈ వినూత్న ఆఫర్కు తెరలేపింది.

అమీన్పూర్, అక్టోబర్ 18 (సిరి న్యూస్)





ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

దౌల్తాబాద్–హత్నూర–సరిపురం రహదారిని బాగుచేయాలని రాస్తారోకో - ఎమ్మెల్యే, కలెక్టర్ వెంటనే స్పందించాలని ఎంఆర్పీఎస్ డిమాండ్

హత్నూర, అక్టోబర్ 18 (సిరి న్యూస్): పెద్దపెద్ద గుంతలతో ప్రమాదకరంగా మారిన దౌల్తాబాద్-హత్నూర-సిరిపురం ప్రధాన రహదారిని వెంటనే బాగుచేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం హత్నూరలో రాస్తారోకో నిర్వహించారు. డాక్టర్ బాబూ జగ్జీవన్రామ్ విగ్రహం సమీపంలో ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ దేవులపల్లి మహేష్ మాదిగ, కొండగళ్ల దుర్గయ్య సమన్వయంతో ఎంఆర్పీఎస్, ప్రజాసంఘాల నాయకులు, గ్రామస్థులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ సంగారెడ్డి జిల్లా నాయకుడు మైసగళ్ల బుచ్చేంద్ర మాదిగ మాట్లాడుతూ.. ప్రధాన రహదారి తీవ్రంగా దెబ్బతినడంతో వాహనదారులు, గ్రామాల ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి దుస్థితి కారణంగా జరుగుతున్న ప్రమాదాల్లో కొందరు ప్రాణాలు కోల్పోగా, మరికొందరు గాయపడ్డారని ఆయన పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతున్నా ప్రభుత్వం, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రమాదాల నివారణకు వెంటనే గుంతలను పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. శాశ్వత పరిష్కారంగా నూతన రహదారిని మంజూరు చేసి, నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి రహదారి అభివృద్ధికి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ ఆర్అండ్బీ అధికారులతో సమన్వయం చేసి యుద్ధప్రాతిపదికన రోడ్డు గుంతలను పూడ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు రహదారి సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో దేవులపల్లి మహేష్ మాదిగ, ఎంఆర్పీఎస్ నాయకులు నల్లోల్ల మొగులయ్య, కొండగళ్ల దుర్గయ్య, కొండగళ్ల శ్రీధర్, మహంకాళి, మహమ్మద్ ఆసిఫ్, ఎండీ ఈషా, నల్లోల్ల కుమార్, ప్రవీణ్ నాయకులు, హత్నూర గ్రామస్థులు పాల్గొన్నారు.

మందు కొంటే.. మటన్ ఫ్రీ!



ఇదెక్కడి ఆఫర్ భయ్యా..వైరల్ ప్లెక్సీ రచ్చ

హౌస్ ఆఫ్ స్పిరిట్ వైన్స్ దసరా ధమాకా.. మందు బాబులకు పండగ

- తోటి వ్యాపారులు లబోదిబో..ఎక్సైజ్ శాఖ నిద్రమత్తు
- హౌస్ ఆఫ్ స్పిరిట్ వైన్స్ ఆఫర్ పై నేటిజన్ల హాట్ చర్చ
- ఈ పద్ధతి కొనసాగితే ప్రతి వైన్స్ షాప్ మూసుకోవాల్సిందే..
- సరుకు మిగిలిపోయిందా? లేదా ఎక్సైరీ దాటిందా?
- వైరల్ ఆఫర్ పై సర్వత్ర అనుమానాలు
- బీరంగూడలో హౌస్ ఆఫ్ స్పిరిట్ దసరా ధమాకా

ఆఫర్ల జోరు.. సోషల్ మీడియా హోరు.. మద్యం విక్రయాలను పెంచుకునేందుకు వ్యాపారులు రకరకాల సరికొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. ఇందులో భాగంగానే మందు కొంటే మటన్ ఫ్రీ అంటూ ఏర్పాటుచేసిన ఒక ఫ్లెక్సీ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో జరుగుతున్నాయా అనుకుంటే పొరపాటే, సరిగ్గా రద్దీగా ఉండే బీరంగూడ ప్రధాన రహదారి నడిబొడ్డున ఉన్న హౌస్ ఆఫ్ స్పిరిట్ వైన్ షాప్ యాజమాన్యం ఈ వినూత్న ఆఫర్కు తెరలేపింది.

అమీన్పూర్, అక్టోబర్ 18 (సిరి న్యూస్)



ఆఫర్ వెనుక అసలు కథ ఏంటి?

కిష్టారెడ్డిపేట్ టు బీరంగూడ ప్రధాన రహదారిపై వెలిసిన మందు కొంటే మటన్ ఫ్రీ ఫ్లెక్సీ పై ఇప్పుడు కొత్త అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది కేవలం సేల్స్ పెంచుకోవడానికి ఇచ్చిన ఆఫరా? లేక కాలం చెల్లిన మందు స్టాకును వదిలించుకునే కుట్రనా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సాధారణంగా మద్యం షాపుల్లో కలెక్షన్ తగ్గిన లేదా డేట్ దగ్గర పడుతున్న స్టాకు భారీగా మిగిలిపోయిన ఇలాంటి అడ్డదారి ప్రచారాలు చేస్తారనే టాక్ నడుస్తోంది. ఎక్సైరీ దాటిన లేదా డేట్ ముగియడానికి సిద్ధంగా ఉన్న మందును త్వరగా ఖాళీ చేసేందుకు ఈ మటన్ ఫ్రీ ఎర వేశారా అని అనుమానాలు బలపడుతున్నాయి.

తోటి వ్యాపారుల్లో గందరగోళం

ఒకే ప్రాంతంలో ఇలాంటి అనారోగ్యకరమైన హద్దు మీరిన ఆఫర్లు ప్రకటిస్తుండటంతో చుట్టుపక్కల ఉన్న మిగతా వైన్ షాపుల వ్యాపారులు తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తుందని వ్యాపారంలో సమతుల్యత దెబ్బతింటోందనీ ఆందోళన చెందుతున్నారు.



ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం..

ఈ ఆఫర్ కారణంగా రోడ్లపైనే వాహనాలు నిలపడం, మందుబాబులు గుమ్మి కూడటంతో ప్రధాన రహదారిపై నిత్యం తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతాయని స్థానికులు వాపోతున్నారు. సిండికేట్ ఒత్తిళ్లు, నిబంధనలకు తూట్లు ఎక్సైజ్ నిబంధనల ప్రకారం ఇలాంటి ప్రమోషన్లు చేయకూడదు, కానీ కొందరు నిబంధనలను బేకాతార్ చేస్తూ ఇలాంటి దందా లకు పాల్పడుతుండడంతో నిబంధనలు పాటించే మిగతా వ్యాపారులు నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

ఎక్సైజ్ శాఖ నిద్రమత్తు..

నిబంధనలు గాలికి వదిలేసి ఇలాంటి ప్రమోషన్లు జరుగుతున్న సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అసలు ఎక్సైజ్ శాఖ ఏం చేస్తోంది? అంటూ ప్రజలు, ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి.

మందు బాబుల పండగ..

ఈ వినూత్నమైన, ఆశ్చర్యకరమైన ఆఫర్ చూసి నేటిజన్లు ముఖ్యంగా మందుబాబులు ఆశ్చర్యపోతున్నారు. ఈ ఫ్లెక్సీ కి సంబంధించిన ఫోటోలు వాట్సప్ ఫేస్బుక్ మరియు ఇంస్టాగ్రామ్ లో తెగ సర్కిల్ అవుతున్నాయి.

దసరా ముసుగులో భారీ ఆఫర్..

పండుగ రోజు తరుణంలో కస్టమర్లను ఎగబడేలా చేయడానికి మందు కొంటె మటన్ ఫ్రీ అంటూ ఏకంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేసి బహిరంగంగానే లిక్కర్ మాటు ముందు ప్రచారం చేసుకుంటున్నారు. ఈ విచిత్రమైన ఆఫర్ స్థానికంగా హాట్ టాపిక్ గా మారింది.